ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

అన్నమయ్య
జిల్లా వార్తలు

5

మంగళవారం 4 ఫిబ్రవరి 2025

మూడు స్టేషన్ల ఆధునికీకరణ

● కేంద్ర రైల్వే బడ్జెట్‌లో జిల్లాకు స్థానం ● ప్రయాణీకులకు సమకూరనున్న మరిన్ని వసతులు ● కడప-బెంగళూరు రైల్వేమార్గం ఇక లేనట్లే?



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): కేంద్ర రైల్వే బడ్జెట్‌లో గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి జిల్లాకు స్థానం దక్కింది. రైల్వేబడ్జెట్‌లో జిల్లాలోని రాజంపేట, పీలేరు, మదనపల్లె రైల్వేస్టేషన్ల ఆధునీకీకరణకు నిధులు కేటాయించారు. దీనివల్ల ప్రయాణీకులకు మరిన్ని వసతులు సమకూరనున్నాయి. అదే సమయంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి చేసిన పాపం రాయచోటి ప్రాంత వాసుల చిరకాల కోరికైన కడప-బెంగళూరు రైల్వేమార్గానికి గండికొట్టింది. దీంతో ఇక కడప-బెంగళూరు వయా రాయచోటి రైల్వేమార్గం ఇక లేనట్లేనని ఈ ప్రాంత వాసులు ఆవేదన చెందుతున్నారు.

మదనపల్లెలో...

జిల్లాలో మదనపల్లె రోడ్ సీటీఎం రైల్వేస్టేషన్ చాలా ప్రధానమైంది. బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఈ స్టేషన్ నుంచి మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, కర్ణాటక ప్రాంతాల నుంచి రోజుకు వెయ్యి మందికిపైగా ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. మదనపల్లెకు పది కిలో మీటర్ల దూరంలోని సీటీఎం రైల్వేస్టేషన్ చాలా అందుబాటులో ఉన్నప్పటికీ ఆ స్థాయిలో అక్కడ సౌకర్యాలు, వసతులు లేవు. ఇక్కడి కేంద్రంగా తిరుపతి-హైదరాబాద్, తిరుపతి-సికింద్రాబాద్, గుంతకల్లు-తిరుపతి, ధర్మవరం-నర్సాపూర్, ముంబై-చెన్నై ఏరియాలకు రైళ్లు నడుస్తున్నాయి.

రైల్వేస్టేషన్‌లో సమస్యల కూత..

మదనపల్లె రోడ్ రైల్వేస్టేషన్‌లో అనేక సమస్యలు కూత పెడుతున్నాయి. ఇక్కడి ప్రయాణికుల రద్దీకి తగ్గట్టుగా సౌకర్యాలు, సేవలు కల్పించలేదు. ముఖ్యంగా స్టేషన్‌లో ప్యాసింజర్లకు వెయిటింగ్ హాలు లేకపోవడంతో ప్లాట్‌ఫాంపైనే నిరీక్షిస్తున్నారు. పేరుకు మరుగుదొడ్లు ఉన్నా నిర్వహణ లేక వినియోగంలో లేవు. ప్లాట్‌ఫామ్స్‌పై తాగునీటి సౌకర్యం లేదు. అక్కడ నిర్మించిన దిమ్మెలు పగిలిపోయి నిరుపయోగంగా మారాయి. ఒక ప్లాట్‌ఫాం నుంచి మరో ప్లాట్‌ఫాంపైకి ప్యాసింజర్లు వెళ్లాలంటే నడక దారిన మెట్లు ఎక్కి వెళ్లాల్సి రావడంతో వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారు. టికెట్లు ఇచ్చే కౌంటర్ కూడా ఇరుకుగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ ప్రయాణీకులకు సరైన నీడ సౌకర్యం లేదు. అక్కడక్కడా రేకుల షెడ్డు ఉంది. అయితే రద్దీకి తగినట్లు కూర్చోవడానికి బెంచీలు లేవు. దీంతో రైలు వచ్చేంత వరకు ప్రయాణీకులు నిలబడి ఉండాల్సి వస్తోంది. సీటీఎం రైల్వేస్టేషన్ ఆధునీకీకరణలో భాగంగా వెయిటింగ్ హాలు, నీడకోసం షెడ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇవి పూర్తయి వినియోగంలోకి వస్తే ప్రయాణీకులకు సౌకర్యవంతంగా ఉంటుంది. ప్రస్తుత బడ్జెట్‌లో రైల్వే శాఖామంత్రి నిధులు కేటాయించడంపై ప్రయాణీకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కడప-బెంగళూరు రైల్వేలైన్ ఇక లేనట్లే?



2008-09 రైల్వే బడ్జెట్‌లో కడప-రాయచోటి, మదనపల్లె-బెంగుళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైలుమార్గం మంజూరైంది. రైలు మార్గం పొడవు 255.40 కిలోమీటర్లు ఉండగా.. అందులో 205 కిలోమీటర్లు ఆంధ్రప్రదేశ్‌లో, 50 కిలోమీటర్లు కర్నాటక రాష్ట్రంలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టు కోసం ఖర్చయ్యే నిధులలో 50 శాతం కేంద్ర ప్రభుత్వం, 50 రాష్ట్ర ప్రభుత్వం భరించే షరతులతో మంజూరైంది. 2008-09 సంవత్సరం అంచనా మేరకు ప్రాజెక్టు వ్యయం రూ.3038 కోట్లు. 2010 సంవత్సరంలో అప్పటి రైల్వే మంత్రి మునియప్ప ఈ పనులకు శంకుస్థాపన చేశారు. నాలుగు దశల్లో ప్రాజెక్టు పని పూర్తి చేయాలని అనుకున్నారు. మొదటి దశలో కడప నుంచి పెండ్లిమర్రి వరకు రెండవ దశలో పెండ్లిమర్రి నుంచి లక్కిరెడ్డిపల్లె, మూడో దశలో రాయచోటి నుంచి వాల్మీకిపురం, నాలుగో దశలో వాల్మీకిపురం నుంచి మదనపల్లె సరిహద్దు అయిన ముల్‌బాగల్ నుంచి కోలార్ వరకు నిర్మాణం పూర్తయ్యే విధంగా రూపకల్పన జరిగింది. మొదటి దశలో కడప-పెండ్లిమర్రి వరకు 21.80 కిలోమీటర్ల దూరం పని పూర్తయింది. ఇప్పటికి రూ.351 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాటాగా గత ప్రభుత్వ వాటాగా గత కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు రూ.132.29 కోట్లు చెల్లించాయి.

పీలేరు రైల్వేస్టేషన్‌లో ముమ్మరంగా పనులు

అమృత్ భారత్ స్టేషన్ స్కీం పథకం ద్వారా రూ.75 లక్షలను పీలేరు రైల్వేస్టేషన్ ఆధునికీకరణ, సుందరీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం 2024-25 బడ్జెట్లో మంజూరు చేసింది. అయితే సుమారు 9 నెలల క్రితమే ఈ స్టేషన్‌లో పనులు మొదలయ్యాయి. ప్రస్తుతం ఈ నిధులతో పీలేరు రైల్వేస్టేషన్‌కు స్వాగత ఆర్చీ, ప్రయాణీకుల కోసం లిఫ్ట్ సౌకర్యం, రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం సుందరీకరణ, ప్రయాణీకుల సౌకర్యార్థం కోచ్ పొజిషన్ డిస్‌ప్లే, డిజిటల్ బోర్డు.. ప్లాట్‌ఫాం పైకప్పు విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది మే చివరి నాటికి పూర్తి చేసేందుకు రైల్వే అధికారులు కసరత్తు చేస్తున్నారు.



2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వ వాటాను చెల్లించకపోవడంతో రైల్వే శాఖ పనులు నిలిపేసింది. పుండు మీద కారం చెల్లినట్లు ఈ రైల్వేలైను వద్దని దానికి బదులుగా ముద్దనూరు-పులివెందుల, ముదిగుబ్బ నూతన రైల్వేలైన్ మంజూరు చేయమని 2021 జూలై 17న జగన్ కేంద్రానికి లేఖ రాశారు. దీంతో ఈ రైల్వేలైన్ అటకెక్కింది. రాష్ట్ర ప్రభుత్వ వాటాగా చెల్లించాల్సిన మ్యాచింగ్ గ్రాంటు నిధులు చెల్లించకపోవడంతో రైల్వేశాఖ ఈ పనులను నిలిపేసింది. దీంతో కడప-బెంగళూరు వయా రాయచోటి రైలుమార్గానికి మోక్షం లేకుండాపోయింది. దీనిపై రాయచోటి ప్రాంత ప్రజలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంత ం గుండా రైలు మార్గం వెళ్లి ఉంటే... మెరుగైన రవాణా సౌకర్యాలతో పాటు వ్యాపారపరంగానూ ఎంతో మేలు కలిగేదని స్థానికులు పేర్కొంటున్నారు.

బ్రిటిష్ కాలం నాటి రాజంపేట రైల్వేస్టేషన్

రెవెన్యూ డివిజనల్ పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో బ్రిటిష్‌ల హయాంలోనే రైల్వేస్టేషన్ ఏర్పాటు చేశారు. రెండు ప్లాట్‌ఫాంలతో ఉన్న ఈ రైల్వేస్టేషన్‌లో ప్రతిరోజూ ముంబై, చెన్నై హైదరాబాదు, మదురై, పూణె వంటి ప్రధాన పట్టణాలకు రైళ్లు వెళుతుంటాయి. ఇక్కడి నుంచి రోజూ తమలపాకులు, నిమ్మకాయలు, మామిడి, అరటి పంటలను రైళ్ల ద్వారా ఎగుమతి చేస్తుంటారు. అయితే ఊరికి తగ్గట్లు రైల్వేస్టేషన్ అభివృద్ధి మాత్రం జరగలేదు. ఎప్పటి నుంచో ఇక్కడ ఆపే సూపర్‌ఫాస్ట్ రైళ్లను కరోనా సమయం నుంచి స్టాపింగ్ ఎత్తివేశారు. ఎన్నోమార్లు ఎంపీలు, ఇతర నాయకులు వినతులు చేసినా కొన్ని రైళ్లు ఆపుతున్నారే కానీ.. మిగిలినవి ఆపడం లేదు. ఈ నేపధ్యంలో కేంద్ర రైల్వేబడ్జెట్‌లో ఈ స్టేషన్ ఆధునికీకరణ, సుందరీకరణ కోసం నిధులు కేటాయించడంతో ఇక్కడ అన్ని రైళ్లకు స్టాపింగ్ ఉంటుందన్న ఆశాభావంలో రైల్వే ప్రయాణికులు ఉన్నారు.





నేటి నుంచి రాష్ట్ర క్రీడా, సాంస్కృతిక పోటీలు

● తరలివచ్చిన 450 మంది విద్యార్థులు

● అన్ని ఏర్పాట్లు పూర్తి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల మైదానంలో మంగళవారం నుంచి అంతర్ కళాశాలల రాష్ట్ర స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నారు. 9ఉద్యాన కళాశాలల నుంచి 450 మంది విద్యార్థులు ఇప్పటికే ఇక్కడికి చేరుకున్నారు. పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల అసోసియేట్ డీన్ పీటీ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 అంశాల్లో పోటీలు నిర్వహిస్తారన్నారు. పోటీల విజయవంతానికి కమిటీలు వేసినట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా వైస్ చాన్సలర్ కె.గోపాల్, విశిష్ట అతిథిగా రాష్ట్ర శాప్ చైర్మన్ రవినాయుడు, రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్‌హెగ్డే హాజరవుతారని తెలిపారు. పోటీలకు వచ్చిన విద్యార్థులకు ఉద్యాన కళాశాల అతిథ్యం ఇస్తోంది. 50 మంది అధ్యాపకులు ఇప్పటికే వచ్చారన్నారు. ప్రధానంగా క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో డ్యాన్సులు, థియేటర్, లిటరరీ, ఫైన్‌ఆర్ట్స్ ఉంటాయన్నారు. ఇప్పటి వరకు 10 సార్లు పోటీలు వివిధ ప్రాంతాల్లో నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం 11వ అంతర్ జిల్లాల పోటీలు అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. 2018 తర్వాత మళ్లీ ఇప్పుడు ఈ పోటీలు జరుపుతున్నట్లు తెలిపారు. క్రీడాకారులు వారి ప్రతిభను బట్టి జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొనే అవకాశాలు ఉంటాయని తెలిపారు. హాజరైన క్రీడాకారులకు భోజనాలు, వసతి కల్పించామని తెలిపారు. పోటీల సందర్భంగా అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ప్రాంగణం విద్యుత్‌దీపకాంతుల్లో మెరిసిపోతోంది.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అసోసియేట్ డీన్ శ్రీనివాస్, తదితరులు

ఆలయ రాజగోపురంపై కలశాలను ప్రతిష్ఠిస్తున్న వేదపండితులు



బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

● ముగిసిన రాజ గోపుర ప్రతిష్ఠ మహోత్సవాలు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు సోమవారం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఆలయ రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఐదు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో ఆలయ నూతన రాజగోపుర ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. చివరి రోజైన సోమవారం వేకువజామున టీటీడీ వేదపండితులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి దూప, దీప నైవేద్యాలతో నిత్య కైంకర్యాలు పూర్తి చేశారు. అనంతరం వేదపండితుల వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ ఉదయం 9:30 నుంచి 10:15 శుభ గడియల మధ్య పూజలు నిర్వహించి రాజగోపురంపై కలశాలను ప్రతిష్ఠించారు. హోమం, మహాపూర్ణాహుతి తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో టీటీడీ వేదపండితులు రమేష్, ధనుష్ స్వామి, ఆలయ సిబ్బంది నగేష్, నాగరాజు, భక్తులు, పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలకు సోమవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. టీటీడీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం వేదపండితుల మంత్రోచ్చారణలతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. కాగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 8:50 వరకు, సాయంత్రం 8 గంటల నుంచి పల్లకీ ఉత్సవం నిర్వహించనున్నారు.



అంకురార్పణకు పూజా వస్తువులు తీసుకువెళ్తున్న దృశ్యం

సమస్యల పరిష్కారంలో అలక్ష్యం చేయొద్దు

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని, అలక్ష్యం చేయొద్దని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేటల్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తుందని, ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను ప్రభుత్వ సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను వందశాతం పరిష్కరించాలన్నారు. సమస్య పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఎస్డీసీ రమాదేవి, అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

పకడ్బందీగా ఇంటర్మీడియట్ పరీక్షలు

● ఈనెల 10 నుంచి ప్రాక్టికల్స్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టరేట్ పరిపాలనాధికారి నాగభూషణం సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ ఆదేశాల మేరకు 2025-26 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో జరగబోయే ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్ పరిపాలనా ధికారి అధ్యక్షతన ఇంటర్మీడియట్ విద్య, ఏపీఎస్ఆర్టీసీ, పోలీస్, వైద్య, విద్యుత్, తపాలా తదితర శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి కృష్ణయ్య జిల్లాలో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షల గురించి వివరించారు. జిల్లాలో ఈనెల 10నుంచి 19వ తేదీ వరకు 63 పరీక్షా కేంద్రాల్లో జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తామన్నారు. మార్చి 1నుంచి 20వ తేదీ వరకు 49 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో మొత్తం 28,602 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలు రాయబోతున్నారని, వీరిలో మొదటి సంవత్సరం 14,855మంది, రెండో సంవత్సరం 13,747 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ప్రాక్టికల్స్‌కు 8,476 మంది జనరల్ విద్యార్థులు, 2,156 మంది ఒకేషన్ విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ అధికారి కృష్ణయ్య

వంకను పూడ్చేశారు... 6 ● వంకలో మట్టి తోలి తన భూమిలో కలుపుకున్న ఘనుడు

కనులపండువగా కల్యాణం

● పోటెత్తిన భక్తజనం ● నేడు రథోత్సవం




గజవాహనంపై ఊరేగుతున్న వెంకటేశ్వరుడు

కడప కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవునికడప లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీనివాసుసుడి కల్యాణం కనులపండువగా సాగింది. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తజనం దేవునికడప ఆలయ బాట పట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఏడుకొండలవాడి పరిణయ వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. ఆలయ ప్రాంగణం వద్ద మామిడి తోరణాలు, అరటి పిలకలతో స్వాగత ద్వారాలుగా తీర్చిదిద్దారు. వివిధ సుగంధ పరిమళ పుష్పాలతో దేవుని కడపలో కల్యాణానికి సిద్ధం చేసిన వేదిక ఇల వైకుంఠాన్ని తలపించింది. సిరులమాత శ్రీదేవి, ముద్దులొలికే భూదేవిలతో కడప రాయుని కల్యాణం ఆద్యంతం నయనమనోహరంగా జరిగింది.

ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమోహన్, సాయి, త్రివిక్రమ్, కృష్ణమూర్తి, తరుణ్‌లు వేద మంత్రాలు జపిస్తుండగా.. మరోవైపు అన్నమయ్య సంకీర్తనల గానామృతం, మంగళ వాయిద్యాల నడుమ తిరుమలేసుని పరిణయం జరిగింది. సాక్షాత్తు ఆ శ్రీనివాసుడే తిరుమల గిరులు దిగి తన ఇరువురు దేవేరులతో దేవునికడపకు విచ్చేశాడా అనే అనుభూతి కలిగింది. కల్యాణం ఆద్యంతం భక్తుల గోవిందనామ స్మరణతో ఆలయం మార్మోగింది. కన్యాదానం, మంగళ సూత్రధారణ, తలంబ్రాలసేవ వైభవంగా సాగాయి. కల్యాణం అనంతరం భక్తులకు ముత్యాల తలంబ్రాలు పంపిణీ చేశారు.

గజవాహనంపై బ్రహ్మాండ నాయకుడు

బ్రహ్మోత్సవాలలో భాగంగా సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ నిర్వహించారు. తదుపరి తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్ట్ వారి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి భక్తులను ఆకట్టుకున్నాయి. రాత్రి 8 గంటలకు ఇరువురు దేవేరులతో కలిసి వెంకటేశ్వరుడు గజ వాహనంపై కొలువుదీరి దేవునికడప మాడవీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో దేవునికడప ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డితో పాటు ఆలయ సిబ్బంది నటేష్‌బాబు, హనుమంతయ్య, వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. కాగా.. దేవునికడప ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రథోత్సవం అత్యంత వైభవోపేతంగా జరుగనుంది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు దేవునికడపకు పోటెత్తనున్నారు. అందుకు తగ్గట్లుగా పోలీసులు తగు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరుడు





స్వామివారి కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు.. స్వామి, అమ్మవార్లకు కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

సమస్యలపై వెంటనే స్పందించండి : ఎస్పీ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలపై వెంటనే స్పందించి వాటిని పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి వారితో మాట్లాడారు. అందులో ప్రధానంగా కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రుల వేధింపులు, భర్త, అత్తారింటి వేధింపులు, భూ, ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి చట్ట పరిధిలో బాధితులకు తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు వివరాల నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

మామిడికి పొగమంచు దెబ్బ

- దోబూచులాడే మబ్బులతో కానరాని మామిడి పూత
- దిగుబడి తగ్గుతుందని రైతుల దిగాలు
- ఈ ఏడాది రైతన్నకు నష్టాలే
- తగ్గనున్న మామిడి వ్యాపారం

రాజంపేట/పెనగలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది మాదిరే ఈ ఏడాది కూడా ప్రకృతి మామిడి రైతుపై కన్నెర్ర చేస్తోంది. ఈ ఏడాది కూడా మామిడి దిగుబడి భారీగా తగ్గనుంది. రైల్వేకోడూరు మార్కెట్ యార్డు ఆధారంగా కోడూరు, రాజంపేట నియోజకవర్గాల్లో ప్రతియేటా మామిడి పంటతో జరిగే 200 కోట్ల వ్యాపారానికి గండి పడనుంది. డిసెంబరు, జనవరి నెలల్లో మామిడి పూత వస్తుంది. డిసెంబరులో ఒక మోస్తరు పూత వస్తే జనవరి నాటికి పూర్తి స్థాయికి వచ్చి ఫిబ్రవరి నుంచి మార్చి నాటికి పిందెలు ఏర్పడి ఏప్రిల్ నుంచి మామిడికాయలు మార్కెట్‌లోకి వస్తాయి. అటువంటిది ఈ ఏడాది డిసెంబరులో ప్రకృతి పూర్తిగా మామిడి రైతుపై కన్నెర్ర చేసింది. డిసెంబరు నుంచి ప్రతిరోజూ మబ్బులు రావడం, అందునా ప్రతిరోజు పొగమంచు రావడం, అప్పుడప్పుడూ చిరుజల్లులు పడ్డాయి. జనవరిలో వచ్చే పెద్ద పండుగ మూడు రోజులు కూడా ఆ తర్వాత రోజులు ఒక మోస్తరు వర్షం కురిసింది. జనవరి నెలలో వర్షం కురవడం అన్నది ఎప్పుడూ జరగదు. వాతావరణంలో జరుగుతున్న పెనుమార్పుల వల్ల మామిడి పూత దశ వచ్చే డిసెంబరు, జనవరి నెలల్లో విపరీతంగా మంచు కురవడం, దట్టంగా పొగమంచు రావడం, చిరుజల్లులు కురవడం శాపంగా మారింది. దీనివల్ల ప్రధానంగా రైల్వేకోడూరు మండలంలోని 20 వేల ఎకరాల్లో సాగయ్యే మామిడి పంట 30 శాతం కూడా పూత పూయలేదు. ఇక చిట్వేలి, పెనగలూరు మండలాల్లో సుమారు 5 వేల ఎకరాల్లో మామిడి పంటకు పూత రాలేదు. వచ్చినా 30 శాతం మించలేదు. ఇక వీరబల్లె, రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె మండలాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ ప్రాంతంలో అత్యంత ఎక్కువ వ్యాపారం జరిగేది ఈ ప్రాంతంలో మామిడి ద్వారానే. సుమారు 30 వేల ఎకరాల్లో ఈ ప్రాంతంలో మామిడి పంట ఉంది. బేనీషా, మలుగుబ, రుమాని, తోతాపూరి, అంటిమామిడి, పునాస, నీలం ఇలా 30 రకాల పైబడి మామిడి పంట పండుతోంది.

దేశంలోని చెన్నై, ముంబాయి, బెంగుళూరు, ఇతర ప్రధాన నగరాలతో పాటు ఇతర దేశాలకు కూడా ఇక్కడి నుంచి ఎగుమతి అవుతూ ఉంటాయి. ప్రతిరోజు 10 లారీల నుంచి 30 లారీల వరకు ఎగుమతి అవుతాయి. అటువంటి పంటకు ప్రకృతి సహకరించకపోవడంతో భారీ ఎత్తున దిగుబడి తగ్గే అవకాశం ఉంది. దీని వల్ల ఆరుగాలం కష్టించి అప్పులు చేసి పెద్దఎత్తున మందులు పిచికారీ, సాగు ఖర్చులు పెట్టుకుని దిగుబడి వస్తుందన్న మామిడి రైతులకు ఈ ఏడాది కూడా నిరాశే మిగిల్చింది. గత ఏడాది మామిడి పంట 30 శాతం కూడా దిగుబడి రాలేదు. దానికి కారణంగా ప్రకృతి కనికరించకపోవడమే. 2023లో భారీఎత్తున ఎవరూ ఊహించని రీతిలో పంట దిగుబడి వచ్చినా అంతర్జాతీయ మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో ఉపయోగం లేకుండా పోయింది. పంట బాగా పండితే గిట్టుబాటు ధర లేకపోవడం, గిట్టుబాటు ధరలు ఉన్నప్పుడు పంటలు పండకపోవడం వంటి కారణాల వల్ల ప్రతియేడాది మామిడి రైతులు భారీ ఎత్తున నష్టపోతున్నారు. చేసేది లేక కొందరు మామిడి రైతులు మామిడి పంటను తీసివేసి ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపే పరిస్థితి ఏర్పడింది.


పెనగలూరు మండలంలోని తూర్పుపల్లె అటవీ ప్రాంత మామిడి తోటను కప్పేసిన పొగమంచు

ఇందులో భాగంగా అక్కడక్కడ మామడి తోటలను తీసివేయడం చేశారు. ఎండలు బాగా కాస్తేనే పూత బాగా వస్తుంది. మామిడి పూత రావడానికి రెండే ప్రధాన ఆధారం. అటువంటిది డిసెంబరు, జనవరి నెలలో మబ్బులు, చిరుజల్లులు, ప్రధానంగా పొగమంచు పూత రాకుండా చేస్తోంది. మామూలుగా ఒక ఎకరా మామిడి తోట బాగా పండితే పెట్టుబడి పోను కనీసం లక్షన్నర రూపాయలు ఆదాయం వస్తుంది. అటువంటిది పెట్టిన పెట్టుబడులు కూడా ఈసారి కూడా వచ్చే పరిస్థితులు కనిపించకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.


రాజంపేట ప్రాంతంలో అరకొరగా వచ్చిన మామిడి పూత


పూతరాకుండా అలంకార ప్రాయంగా ఉన్న మామిడిచెట్లు

వెంటనే అప్రమత్తమైతే పూత పెరగొచ్చు



రైతులు తమ మామిడి తోటల్లో పూత రాకపోతే వెను వెంటనే కొన్ని మెళకువలు పాటిస్తే పూత పెరుగుతుంది. ప్రధానంగా పూత రాని తోటల్లో పూమొగ్గలు ఉత్తేజపరిచి పూత రావడానికి ఆడపూల శాతం పెరగడానికి పొటాషియం నైట్రేట్, ఫార్ములా-4 లేదా ఆర్గాన్ మ్యాంగో స్పెషల్ లీటరు నీటికి తగు మోతాదులో పిచికారీ చేయాలి. పూమొగ్గ దశలో తేనెమంచు పురుగు, పక్షి కన్ను తెగులు ఆశించే అవకాశం అధికంగా ఉన్నందున మోనోక్రోటోపాస్, కార్బానిజం, వేపనూనె తగు మోతాదులో కాండం, కొమ్మలు బాగా తడిచేలా పిచికారి చేస్తే బాగా పూత వస్తుంది.

- సురేష్‌బాబు, ఉద్యాన శాఖ అధికారి, రాజంపేట.

40 ఎకరాల్లో నాలుగెకరాల్లో కూడా పూత రాలేదు



40 ఎకరాల్లో మామిడి పంట మాకు ఉంటే అందులో నాలుగెకరాల చెట్లకు కూడా పూత రాలేదు. ఎకరాకు వంద చెట్లు ఉంటే కనీసం 5 చెట్లకు కూడా పూత రాలేదు. వచ్చినా ఒకటిరెండు చోట్ల వచ్చి అది కూడా పూత రాలిపోతోంది. ఎకరాకు 20 వేలు ఖర్చు చేసి 40 ఎకరాలు సాగు చేస్తే సుమారు 10 లక్షలు ఖర్చయింది. ఫిబ్రవరి నాటికి పూత 30 శాతం కూడా రాకపోవడంతో మామిడిపై పెట్టుకున్న ఆశలు నిరాశలవుతున్నాయి. గత ఏడాది 5 లక్షలు కూడా రాలేదు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి ఉంది. ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఎంత ఖర్చు చేసినా పూత రాకపోవడంతో మా ఆశలు ఈ ఏడాది కూడా నెరవేరేటట్లు లేదు.

-తుమ్మలకుంట ఈశ్వర్‌కుమార్, మామిడి రైతు, నాగిరెడ్డిపల్లె గ్రామం

పూత మాగిపోయింది



మా భూములు పండ్ల తోటలు చెయ్యేటి పరివాహక ప్రాంతంలోనే ఉన్నాయి. మా ప్రాంతమంతా ఎప్పుడూ చలి ప్రాంతంగా ఉంటుంది. అందువల్ల సీజన్ మారిపోయినా కొన్ని రకాల మామిడి చెట్లలో సకాలంలోనే పూత వచ్చింది. పుష్కలంగా పూత వస్తుందని ఆశపడ్డ రోజులు జరుగుతుండగా పూత మగ్గిపోతోంది. శాస్త్రవేత్తలను ఆశ్రయించాల్సి వచ్చింది.

- డి.శివకుమార్‌రెడ్డి, నర్సింగరాజపురం, పెనగలూరు

తలకు మించిన భారంగా ఖర్చులు



నాకు ఉన్న మామిడితోటకు ఖర్చులు యేటా తలకుమించిన భారంగా మారాయి. రెండేళ్లలో మామిడి తోటల్లో సేద్యపు ఖర్చులు, మందుల పిచికారీ ఖర్చులు పెరిగిపోయాయి తప్పితే దిగుబడి మాత్రం రాలేదు. ఈ ఏడాది అయినా 10 రూపాయలు కళ్ల చూద్దామనుకుంటే తికమక వాతావరణంతో ఇంకా పూత రాలేదు. అయినా సరే వ్యవసాయంపై ఉన్న మక్కువ వదలను.

- బద్దల వెంకటయ్య, రైతు, సాతపల్లె, పెనగలూరు

వంకను పూడ్చేశారు...

- వంకలో మట్టి తోలి తన భూమిలో కలుపుకున్న ఘనుడు

సిద్దవటం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : తన పొలానికి ఆనుకుని ఉన్న వంకను సైతం ఓ రైతు ఆక్రమించుకుని తన భూమిలో కలిపేసుకున్నాడు. వర్షాకాలంలో ఈ వంక నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తూ పెన్నానదిలో కలుస్తుంది. అటువంటి వంకను దాదాపు సగం పూడ్చివేసి కాలువలాగా మార్చివేసి దాదాపు 50 సెంట్లకు పైగా వంక స్థలాన్ని కబ్జా చేశాడు. కడప-పోరుమామిళ్ల రహదారి సిద్దవటం గ్రామం రెవెన్యూ పొలం సర్వే నెంబరు 378, 54/1, 54/2లో సుమారు ఐదెకరాలు పట్టా కలిగిన కడప నగరానికి చెందిన ఓ రైతు తన పొలానికి ఆనుకున్న ఉన్న వంకను పూడ్చివేసి దాదాపు 50 సెంట్లకు పైగా తన స్థలంలో కలుపుకున్నాడు. ఆ స్థలంలో చదును చేసి ప్లాట్లు వేస్తున్నాడు. రెవెన్యూ అధికారులు కూడా ఆ భూమికి హద్దులు ఏర్పాటు చేసిన రాళ్లను నాటినా వాటిని దాటుకుని వంక స్థలాన్ని కూడా ఆ రైతు చదును చేసి తన పొలంలో కలుపుకున్నాడు. డిసెంబరు నుంచి ఈ వ్యవహారం జరుగుతున్నా అధికారులు ఎవరూ అటువైపు కన్నెత్తి కూడా చూడలేదన్న విమర్శలున్నాయి. ఎగువ ప్రాంతమైన అవసరకోన, కోతిరాయికొండ, దుర్గమ్మకోన ప్రాంతాల నుంచి వర్షాకాలంలో వచ్చే నీటితో ఈ వంక ఉధ్రుతంగా ప్రవహిస్తూ పెన్నానదిలో కలుస్తుంది. ఇటువంటి వంకను పూడ్చివేయడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు. వంక కబ్జా విషయమై ఇరిగేషన్‌శాఖ ఏఈ సాయిక్రిష్ణను వివరణ కోరగా ఈ విషయం మా దృష్టికి రాలేదని, వంక అన్యాక్రాంతం అయి ఉంటే స్థానిక తహశీల్దారు ఆధ్వర్యంలో సర్వే చేసి అన్యాక్రాంతం అయిన వంక స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.


వంకను కబ్జా చేసి తోలిన మట్టి

హంద్రీ-నీవా ప్రాజెక్టు సామర్థ్యం పెంచాలి

- చిప్పిలి ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణం పూర్తిచేయాలి
- సబ్‌కలెక్టరేట్ ఎదుట సీపీఐ రాష్ట్ర నాయకుల ధర్నా

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి):రాయలసీమలోని అనంతపురం, ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యవసాయ భూములకు సాగునీరు, పట్టణాలకు తాగునీరు అందించే హంద్రీ-నీవా ప్రాజెక్టు నీటిపారుదల సామర్థ్యం పెంచాలని సీపీఐ రాష్ట్ర నాయకులు జి.ఈశ్వరయ్య, రామానాయుడు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ రాయలసీమకు కృష్ణానది జలాలు తీసుకురావడానికి 20 ఏళ్ల క్రితం ప్రారంభించిన హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులు రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఇంత వరకు సంపూర్తి కాలేదన్నారు. 6లక్షల ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందించేందుకు రూపొందిస్తున్న ఈ ప్రాజెక్టులో అనంతపురం జిల్లాలో 3.45లక్షల ఆయకట్టు భూములకు సరిపడా హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువ తవ్వలేదన్నారు. మొత్తం భూములకు సాగునీరు అందించాలంటే 10వేల క్యూసెక్కుల సామర్థ్యంతో హంద్రీ-నీవా కాలువ వెడల్పు చేయాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు మాట్లాడుతూ హంద్రీ-నీవాకు సమాంతరంగా కాలువ తవ్వాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు మాట్లాడుతూ మదనపల్లె పట్టణానికి తాగునీరు అందించేందుకు నిర్మిస్తున్న చిప్పిలి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నిర్మాణ పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం హంద్రీ-నీవా ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయకుండా మూలన పడేసిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వమైనా ఈ ప్రాజెక్టును ఆరు నెలల్లో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన సేన శ్రీచందు, సీపీఐ నాయకులు కృష్ణప్ప, సాంబశివ, మురళి, మనోహర్‌రెడ్డి, సుధీర్, వెంకటేశ్ రంగారెడ్డి, హరి, సురేష్‌కుమార్, తిరుమల, సలీమ్ తదితరులుపాల్గొన్నారు.


సబ్‌కలెక్టరేట్ ఎదుట సీపీఐ మహాధర్నాలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరయ్య

10న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఉచితంగా అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. జా తీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అన్ని అంగన్వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో అల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల మాత్రలు పంపిణీ చేస్తారని, దీని ద్వారా నులిపురుగుల సంక్రమణను సులభంగా నిర్మూలించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులందరూ వారి పిల్లలకు మాత్రలను అందేవిధంగా చేసి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఎస్‌డీసీ రమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శైలజ, ఆ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సహకార సంవత్సర గోడపత్రిక ఆవిష్కరణ

ఐక్యరాజ్యసమితి-2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా గుర్తించిన నేపథ్యంలో సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా సహకారశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను కలెక్టర్ శ్రీధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025వ సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ సహకార సంవత్సరంగా గుర్తించిందని, సహకార సంఘాలు మెరుగైన ప్రపంచాన్ని నిర్మిస్తాయి అని ఐక్యరాజ్యసమితి ఈ సంవత్సరానికి ప్రకటించిందన్నారు. జిల్లాలో సహకార కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించిన విధంగా జరపాలని జిల్లా సహకార అధికారిని, ఆ శాఖ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, ఎస్‌డీసీలతో పాటు జిల్లా సహకారశాఖ అధికారి గురుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయొద్దు

- విద్యాశాఖ ఉన్నతాధికారులకు యూటీఎఫ్ అన్నమయ్య జిల్లాశాఖ వినతి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబర్ 117కు ప్రత్యామ్నాయ మార్గదర్శకాల పేరుతో చేస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విలీనాన్ని ఆపాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయవద్దని విద్యాశాఖ ఉన్నతాధికారులకు యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. సోమవారం రాయచోటిలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, షేక్ జాబీర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్నాయన్నారు. గత ప్రభుత్వం జీవో నెంబర్ 117తో ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి ప్రభుత్వ విద్యా వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నాటి తప్పులను సరిచేసి విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటామని నాయకులు తెలిపారన్నారు. అయితే గత ప్రభుత్వం తరగతులను విలీనం చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం పాఠశాలలనే విలీనం చేస్తోందని ఆరోపించారు. ఒక పంచాయతీలోని ప్రాథమిక పాఠశాలలను అన్నింటినీ విలీనం చేసి, ప్రాథమికోన్నత పాఠశాలల మనుగడే లేకుండా చేస్తోందన్నారు. ఫలితంగా భవిష్యత్తులో మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 60 పైగా ఉన్నా, తగినన్ని తరగతి గదులు మౌలిక వసతులు లేకపోతే వాటిని ఐదు కిలోమీటర్ల లోపు దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో కలిపివేస్తామనడం ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు నిదర్శనమన్నారు. మౌలిక వసతులు, మూడు కిలోమీటర్ల దూరంలో సంబంధం లేకుండా 60 మంది విద్యార్థులు పైబడి ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలన్నింటినీ ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని వారు డిమాం డ్ చేశారు. 60 పైబడి విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రైమరీగా తీర్చిదిద్దడమే కాకుండా, ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులను కూడా నియమించాలని, ఉన్నత పాఠశాలల్లో 40 మంది విద్యార్థులకు ఒక సెక్షన్‌గా నిర్ణయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు శివారెడ్డి, కోశాధికారి చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్లు చెంగల్‌రాజు, శివారెడ్డి, జిల్లా కార్యదర్శులు వెంకట్రమణ, వెంకటసుబ్బయ్య, శ్రీధర్‌రెడ్డి, అక్రంబాషా, ఆదినారాయణ, దావుద్దీన్, ప్రచురణల విభాగం జిల్లా కన్వీనర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

బి.కొత్తకోట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగుచూసింది. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. బి.కొత్తకోట మండలం బయ్యప్పగారిపల్లె పంచాయతీ పప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన పీవీ శేఖర్‌రెడ్డి భార్య కవిత(33) అంగళ్లలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో అటెండర్‌గా పనిచేస్తోంది. శేఖర్‌రెడ్డితో మేనరికం కారణంగా వివాహమైంది. వారికి పదహారేళ్ల కుమారుడు ఉన్నాడు. గత కొంత కాలంగా భార్యభర్తల మధ్య ఫోన్ మెసేజ్‌ల కారణంగా మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో ఆమె వ్యవసాయ పొలం వద్ద ఉన్న బావిలో శవమై తేలింది. సీఐ జీవన్ గంగనాథ్ బాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. కవిత చిన్నాన్న శంకర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిమెంట్ లారీ బోల్తా - డ్రైవర్ మృతి



రోడ్డుపై పక్కకు ఒరిగి పడిపోయిన సిమెంట్ లారీ, (ఇన్‌సెట్లో) డ్రైవర్ రాజు

కాశినాయన, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రాపురం వద్ద సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ రాజు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ హనుమంతు వివరాల మేరకు.. ఒంగోలు జిల్లాలోని కంభం మార్కాపురంలో సిమెంట్ లోడు లారీ ప్రొద్దుటూరుకు వెళ్తూ పోరుమామిళ్ల- మైదుకూరు ప్రధాన రహదారిపై సోమవారం ప్రమాదానికి గురైందన్నారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ రాజు (50) అక్కడికక్కడే మృతిచెందగా, క్లీనర్ ప్రాణాలతో బయటపడ్డాడని తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రస్తుతం ప్రమాదం జరిగిన ప్రాంతంలో తారురోడ్డు పనులు జరుగుతున్నాయి. రోడ్డు ఎత్తు తగ్గులు ఉండడంతో లారీ పక్కకు ఒరిగి పడిపోయినట్లు సమాచారం. ఈ ప్రమాదం జరిగిన కూతవేటు దూరంలోనే ఓ పెద్ద ట్రాన్స్‌ఫారం ఉంది. ఒకవేళ దాన్ని ఢీకొన్నట్లయితే పెనుప్రమాదం జరిగి ఉండేది.

మృతుడి వివరాలు గుర్తింపు

కొండాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కొండాపురం పంప్‌హౌస్ సమీపంలో ఆదివారం రైలుకింద పడి మృతిచెందిన వ్యక్తి వివరాలను సోమవారం ఎర్రగుంట్ల రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుడు పులివెందులకు చెందిన మల్లేపల్లి రంగనాథ్‌గా గుర్తించారు. ఇతను గత కొంతకాలంగా పక్షవాతం వ్యాధితో బాధపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లిదండ్రుల స్వస్థలం చౌటిపల్లె కావడంతో ఇక్కడికి వచ్చి అనారోగ్య సమస్యలతో రైలుకింద పడి మృతిచెంది ఉండవచ్చని పోలీ సులు భావిస్తున్నారు. కాగా ఇతనికి భార్యతో పాటు ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో మృత దేహానికి పోస్టు మార్టం నిర్వహించినట్లు రైల్వే ఎస్సై సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.


అతివలు... అక్షర వెలుగులు

- మహిళల వికాసానికి ఉల్లాస్
- ప్రారంభమైన బోధనా తరగతులు
- అక్షరజ్ఞానం, దైనందిన విషయాలపై అవగాహన

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు. మహిళలు అక్షరాస్యత సాధిస్తేనే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుంది. కానీ గ్రామీణ ప్రాంతాల్లో నేటికి చాలా మంది అతివలు నిరక్షరాస్యులుగా మిగిలిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులకు చదవడం, రాయడంతో పాటు డిజిటల్ లావాదేవీలు అలవాటు చేసేందుకు 'ఉల్లాస్' (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) అనే పేరుతో వయోజన విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మారుతున్న కాలానికి అనుగుణంగా వీరందరికీ అక్షర జ్ఞానం కలిగించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ప్రధాన లక్ష్యం. 15 ఏళ్ల వయస్సు పైబడి ప్రాథమిక విద్యకు నోచుకోని వారు మధ్యలోనే బడి మానేసి అక్షరాలను మరచిపోయిన వారిని గ్రామస్థాయిలో గుర్తించారు. ఇందుకు కార్యాచరణ, రూపకల్పన చేసి క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నారు.

విద్యావంతులకు శిక్షణ

ఎలాంటి లాభాపేక్ష లేకుండా స్వచ్ఛందంగా చదువు చెప్పడానికి పొదుపు సంఘాల్లో ఆసక్తి ఉన్న మహిళలు యువతులను గుర్తించి వారికి ఇప్పటికే మండల స్థాయిలో శిక్షణ ఇచ్చారు. పాఠ్యాంశ సామగ్రిని అందజేశారు. ప్రతి గ్రామంలో పొదుపు సంఘాల్లో నిరక్షరాస్యులైన 10 మంది సభ్యులకు ఒక వలంటీరు అక్షరాలతో పాటు సంతకాలు చేయడం నేర్పిస్తారు. వర్ణమాల, లెక్కలు కట్టడం, బ్యాంకు లావాదేవీల నిర్వహణ వంటి పలు అంశాలతో పాటు డిజిటల్ చెల్లింపులు, మొబైల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ చెల్లింపులు, తదితర అక్షరాస్యతపైన పూర్తిస్థాయిలో అవగాహన ఇస్తున్నారు. ఇందుకు గ్రామాల్లో వెసులుబాటు ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, అందరికి ఆమోద యోగ్యమైన ప్రదేశాల్లో ప్రత్యేక తరగతుల విద్యాబోధనకు సిద్ధం చేశారు.



నిరక్షరాస్యులకు బోధించే పుస్తకం



నరసింహాపురంలో మహిళల విద్యాభ్యాసం

నిరక్షరాస్యుల ఎంపిక

ఉమ్మడి కడపజిల్లాలో 65 మండలాల్లోని 36,937 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకు 3,693 కేంద్రాలకు వలంటీర్లను నియమించారు. వలంటీర్లలో పొదుపు సంఘాలకు వీఓఏలు కూడా విద్యాబోధన చేసేందుకు తగిన తర్ఫీదునిచ్చారు. వీరు ప్రతిరోజు సుమారు రెండు గంటలపాటు నిరక్షరాస్యులకు బోధనా తరగతులు నిర్వహిస్తారు. బోధనకు జిల్లా వ్యాప్తంగా మార్గదర్శక వాచకం, అక్షర వెలుగు సంక్షిప్త వాచకం, అభ్యాసపు హాజరు పట్టీలు అందించారు. వీటినన్నింటినీ మండల కేంద్రాల నుంచి అన్ని గ్రామీణ ప్రాంతాల్లోని వయోజన విద్యాకేంద్రాలకు సరఫరా చేశారు. స్వయం సంఘాల్లో వీఓఏలను వలంటీర్లుగా ఎంపిక చేసి వారి ద్వారా గ్రామాల్లో బోధన అందిస్తున్నారు. జనవరి 27 నుంచి ప్రారంభమైన ఈ శిక్షణ తరగతులు మార్చి నెల 18 నాటికి శిక్షణ ప్రక్రియ పూర్తిచేయనున్నారు. ఈ ప్రత్యేక శిక్షణ తరగతుల ప్రక్రియపై వివిధ శాఖల అధికారులను పర్యవేక్షకులుగా నియమించారు. వయోజన విద్య సజావుగా సాగేలా వీరు పర్యవేక్షించనున్నారు.

అక్షర వెలుగులు నింపుతాం

- వెంకటసుబ్బమ్మ, వెలుగు ఏపీఎం, ప్రొద్దుటూరు మండలం

మహిళలు డిజిటల్ మోసాలకు గురికాకుండా అవగాహన కల్పిస్తున్నాం. తెలుగుభాష, గణితంతో పాటు దైనందిన వినియోగానికి సంబంధించిన నైపుణ్యాలను పెంపొందిస్తాం. ప్రొద్దుటూరు మండలంలో 1700 మంది నిరక్షరాస్యులను గుర్తించాం. వీరికి 170 మంది వలంటీర్లతో రోజుకు గంటన్నరపాటు బోధన జరిగేలా పర్యవేక్షణ ఉంటుంది. శిక్షణ కాల పరిమితి పూర్తయ్యే నాటికి అతివల్లో అక్షర వెలుగులను నింపుతాం.

దస్తగిరిరెడ్డిపై దాడి కేసులో నిందితుల అరెస్టు

- ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి
- పులివెందుల డీఎస్పీ మురళి



మాట్లాడుతున్న డీఎస్పీ మురళి

పులివెందులటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలం ఇనగనూరు గ్రామానికి చెందిన దస్తగిరిరెడ్డిపై గత నెల 29న జరిగిన దాడి కేసులో నలుగురు నిందితులకు గానూ ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ మురళీనాయక్ తెలిపారు. సోమవారం అర్బన్ పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 29న ఇనుగనూరు గ్రామానికి చెందిన దస్తగిరిరెడ్డి అలియాస్ బాబురెడ్డి సొంత పనినిమిత్తం పులివెందులకు వచ్చారు. తన పని పూర్తి చేసుకుని తిరిగి స్వగ్రామానికి వెళుతున్న సమయంలో గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన మొరంరెడ్డి సమరసింహారెడ్డి, మొరంరెడ్డి హరికిశోర్‌రెడ్డి అలియా కిశోర్‌కుమార్‌రెడ్డి, మోరంరెడ్డి బాల ఓబుల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి కాపు కాచి దాడి చేశారు. ఈ దాడిలో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసుకు సంబంధించి ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు పులివెందుల డీఎస్పీ మురళీ నేతృత్వంలో పులివెందుల రూరల్ సీఐ రమణ ఆధ్వర్యంలో సింహాద్రిపురం ఎస్ఐ తులసి నాగ ప్రసాద్, తొండూరు ఎస్ఐ చిన్న ఓబన్న వారి సిబ్బంది కలిసి సైదాపురం క్రాస్ రోడ్డు, పులివెందుల ముద్దనూరు మెయిన్ రోడ్డు తొండూరు మండలం వంతెనపై ఉన్న ముగ్గురు నిందితులను గుర్తించి సోమవారం ఉదయం అరెస్టు చేసినట్లు తెలిపారు. కాగా బాధితుడు, నిందితులందరూ ఇనగనూరు గ్రామానికి చెందిన వారేనని, వ్యవసాయ పొలంలో వేసిన 350 చీనీ చెట్లకు కరువు పని బిల్లులు చేయించుకునే విషయమై మనస్పర్థలు వచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలో దస్తగిరిరెడ్డిని ఎలాగైనా చంపాలని నిర్ణయించుకుని, ముందుగా అనుకున్న ప్రకారం గత నెల 29న ఉదయాన్నే తన పని మీద మోటారు సైకిలుపై పులివెందులకు వెళ్తుండడంతో పులివెందుల జేఎన్టీయూ కళాశాల వద్ద నిందితులు ఇనుపరాడ్లతో దాడి చేశారన్నారు. ఈ కేసులో మరో నిందితుడు భాస్కర్‌రెడ్డి ప్రస్తుతానికి పరారీలో ఉన్నాడని, త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు. అలాగే పులివెందుల సబ్‌డివిజను పరిధిలో 18 గ్రామాలను ఫ్యాక్షన్ గ్రామాలుగా గుర్తించామన్నారు. మానవ ప్రాణానికి ఎటువంటి హాని కలిగించినా ఉపేక్షించేది లేదని, అలాగే సబ్ డివిజన్ పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల రూరల్ సీఐ వెంకటరమణ, సింహాద్రిపురం, తొండూరు సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

- నలుగురు అరెస్టు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని నాగులకట్ట వీధి శివార్లలో బైపాస్ రోడ్డు పక్కన వ్యభిచార గృహంపై ఆదివారం రాత్రి దాడి చేసి నలుగురిని పట్టుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తమకు రాబడిన సమాచారం మేరకు బైపాస్ రోడ్డు పక్కన బంకులో తమ సిబ్బంది అక్కడ నిఘా ఉంచారని, అదే సమయంలో అక్కడ ఇద్దరు మహిళలతో పాటు నాగన్న, అబ్దుల్లా అనే వారు ఉన్నట్లు గుర్తించారన్నారు. వారిని చాకచక్యంగా పట్టుకొని అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి, ఆ ప్రాంతంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా హెచ్చరించినట్లు ఎస్ఐ తెలిపారు. ఇలాంటి పరిస్థితి జమ్మలమడుగు పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా ఉన్నట్లయితే ప్రజలు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు.

స్టైఫండ్ పెంచి న్యాయం చేయాలి

- పశువైద్య కళాశాల విద్యార్థుల ఆందోళన



కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వెంటనే స్టైఫండ్‌ను పెంచి న్యాయం చేయాలంటూ పశువైద్య కళాశాల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. సోమవారం గోపవరం పంచాయతీ పరిధిలో ఉన్న వెటర్నరీ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం ఎదుట విద్యార్థి నాయకుడు శివతరుణ్ ఆధ్వర్యంలో దాదాపు 300 మంది విద్యార్థులు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2013 నుంచి ఇప్పటి వరకు తమకు స్టైఫండ్ కింద కేవలం రూ.7 వేలు మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. నిత్యావసర ధరలు పెరిగినా స్టైఫండ్ మాత్రం పెరగలేదని వాపోయారు. ఎంబీబీఎస్ విద్యార్థులతో సమానంగా తాము కూడా ఐదున్నర సంవత్సరాలు చదువుతున్నామని పేర్కొన్నారు. మెడికల్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లో రూ.26 వేలు ఇస్తున్నారని, వెటర్నరీ ఇంటర్న్‌షిప్ కూడా వారితో సమానంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సిలిండర్ పేలి మహిళకు గాయాలు

- త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

సింహాద్రిపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పైడిపాళెం గ్రామంలో వెంకటలక్ష్మి అనే మహిళ ఇంట్లో సోమవారం గ్యాస్ సిలిండర్ పేలి ప్రమాదం చోటు చేసుకుంది. గ్రామస్థుల సమాచారం మేరకు.. వెంకటలక్ష్మి తన సొంత పనుల నిమిత్తం బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చి వంట చేసేందుకు గ్యాస్ పొయ్యిని వెలిగించబోయింది. కాగా గ్యాస్ లీక్ అయిన విషయాన్ని గమనించని వెంకటలక్ష్మి స్టౌవ్ వెలిగించేందుకు లైటర్ ఆన్ చేయగా ఒక్కసారిగా సిలిండర్ పేలింది. ప్రమాదంలో బాధితురాలికి తీవ్రగాయాలయ్యాయి. బాధితురాలిని వెంటనే పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. పేలుడు తీవ్రతకు ఇంటి పైకప్పుతో పాటు గోడల మధ్యన చీలికలు రావడంతో పాటు ఇంట్లోని ఫ్రిజ్, టీవీ తదితర సామగ్రి కూడా పాడైపోయాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



సిలిండర్ పేలి ఇంట్లో చిందర వందరగా పడిన సామగ్రి. (ఇన్‌సెట్లో) నెర్రెలు చీలిన గోడలు

హాకీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రవిచంద్ర


- రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా బి.లక్ష్మిదేవి



జె.రవిచంద్ర, బి.లక్ష్మిదేవి

ప్రొద్దుటూరుటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరుకు చెందిన జె.రవిచంద్ర, బి.లక్ష్మిదేవిలు హాకీ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గానికి ఎంపిక కావడంపై క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారిద్దరూ భార్యభర్తలు కాగా మొదటిసారి రాష్ట్ర కార్యవర్గం సభ్యులుగా ఎంపిక కావడంపై జిల్లా హాకీ అసోసియేషన్ నాయకులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. జె.రవింద్ర రాష్ట్ర హాకీ క్రీడాకారునిగా జాతీయస్థాయిలో ప్రతిభ కనపరిచారు. హాకీ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా, జిల్లా అధ్యక్షునిగా జిల్లాల్లో హాకీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఆయన ప్రతిభ ఆధారంగా పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికై స్పోర్ట్స్ కోటాలో హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో ఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తూనే హాకీ క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నారు. బి.లక్ష్మీదేవి ఖోఖోలో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఆమె ప్రస్తుతం వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలులో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ హాకీ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఫిజికల్ డైరెక్టర్‌గా అనేకమంది విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. హాకీ అసోసియేషన్ వారు చేసిన సేవలను గుర్తించి అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గానికి ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గానికి వారు ఎన్నిక కావడానికి కృషి చేసిన అసోసియేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎన్.నిరంజన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు చాణిక్యరాజు, రాష్ట్ర కార్యదర్శి హర్ష, ఇతర కార్యవర్గ సభ్యులకు హాకీ అసోసియేషన్ మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి శేఖర్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

138 పరుగుల ఆధిక్యతలో ఆంధ్రా జట్టు



ఆంధ్రా - హిమాచల్ ప్రదేశ్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

కడప స్పోర్ట్స్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో ఆంధ్రా -హిమాచల్‌ప్రదేశ్‌ల మధ్య జరుగుతున్న క్రికెట్ పోటీల్లో సోమవారం ఆంధ్ర జట్టు 138 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. వివరాలిలా.. టాస్ నెగ్గి బ్యాటింగ్ దిగిన ఆంధ్రా జట్టు తొలుత 135.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 544 పరుగులు వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హిమాచల్ ప్రదేశ్ జట్టు 124.3 ఓవర్లలో 436 పరుగులు చేసింది. దీంతో ఆంధ్రా జట్టుకు 108 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించినట్లయింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో దిగిన ఆంధ్రజట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి 8 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 30 పరుగులు చేసింది. ఇందులో కె.రేవంత్‌రెడ్డి 19 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. ఇప్పటి వరకు ఆంధ్రాజట్టు 138 పరుగుల ఆధిక్యతతో ఉంది. కాగా ఆటకు మంగళవారం చివరి రోజు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లె పంచాయతీ కానపల్లెకు చెందిన తాటి గంగయ్య (54) సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. గంగయ్యది ముద్దనూరు మండలం తిమ్మాపురం గ్రామం. 35 ఏళ్ల క్రితం కానపల్లెలో వివాహం చేసుకుని ఇక్కడే నివాసముంటున్నాడు. కానపల్లెలో ఇతనికి 5 సెంట్ల స్థలం వుంది. ఇటీవలే ఆ స్థలం అమ్మేశాడు. తన స్వంత ఊరు తిమ్మాపురం వెళ్లాలని తలచాడు. కానీ ఈ స్థలం అమ్మడంపై భార్య భర్తల మధ్య ఘర్షణ జరిగింది. ఆదివారం కూడా తన భార్యతో గొడవ జరగడంతో సోమవారం ఉదయం భార్య బంధువుల ఇంటికి వెళ్లడం ద్వారా ఇంట్లో ఒంటరిగా వున్న గంగయ్య రేకుల ఇంట్లో పైపులకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు గంగరాజు ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేషన్ల రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి కల్పనకు ప్రోత్సాహంలో భాగంగా రుణాల మంజూరు కోసం ఈడబ్ల్యూఎస్, బీసీ, కాపు కార్పొరేషన్లు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో జాషువా ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపారం, పరిశ్రమల ఏర్పాటుతో స్వయం ఉపాధి కల్పించుకునేందుకు 50 శాతం సబ్సిడీతో ఆయా కార్పొరేషన్లు రుణాలు మంజూరు చేస్తాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

కేశాపురం వీఆర్ఏ మృతి

చిన్నమండెం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశాపురం గ్రామ పంచాయతీలో వీఆర్ఏగా పనిచేస్తున్న పాలేటి (60) ఆదివారం రాత్రి అనారోగ్యం కారణంగా మృతి చెందాడు. సోమవారం డీటీ రెడ్డిబాబు, రెవెన్యూ అధికారులు ఆయన పార్థివదేహానికి నివాళులర్పించి దహన సంస్కారాలకు ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సాయం అందించారు.

రోగులకు పండ్లు పంపిణీ

వీరబల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈడిగపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు షేక్. అల్లాబకష్ వర్ధంతి సందర్భంగా సోమవారం తెలుగు యువత నాయకులు సాయికుమార్‌రాజు, పవన్ కల్యాణ్, రఫీ, నాని, వినయ్‌కుమార్‌గౌడ్, శివ, రామకృష్ణంరాజు తదితరులు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో టీడీపీ అభివృద్ధికి అల్లాబకష్ కృషి మరువలేనిదన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

సిద్దవటం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకుని 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. సిద్దవటం బస్టాండులో కమలకూరు రాజన్న(60) అనేవ్యక్తి మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేసి అతనిని అదుపులోకి తీసుకున్నారు. ఏఎస్ఐ బాబయ్య, సుబ్బరామచంద్ర, పోలీసులు పాల్గొన్నారు.

'ఉల్లాస్'తో నిరక్షరాస్యత నిర్మూలన

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ యోజనతో నిరక్షరాస్యత నిర్మూలించవచ్చునని ఎంపీడీవో రెడ్డెయ్య తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో వెలుగు యానిమేటర్లకు ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం వయోజనులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఏపీఎం నిరంజన్ , సీసీలు యానిమేటర్లు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎండీసీ పబ్లిక్ స్కూల్లో పనిచేస్తున్న కార్మికులకు న్యాయం చేయాలని సీపీఐ ఎంఎల్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కార్మికుల దీక్షకు వారు మద్దతు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు అందరికీ అందాలి

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులకు మంచి ఆదరణ లభిస్తోందని మండల వ్యవసాయాధికారి మల్లిక తెలిపారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా ఏర్పాటు చేస్తున్న స్టాల్‌లో తాజా ఆకు కూరలు, కూరగాయలను ప్రజలు ఎగబడి కొంటున్నారన్నారు.

కబ్జా కోరల్లో ప్రభుత్వ భూములు



బొమ్మవరం క్రాస్ వద్ద కాలువలో అక్రమంగా సాగవుతున్న పంట

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చెరువులు, కాలువలు, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని రైతులు, కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న కొర్లకుంట చెరువు, ఆర్ అండ్ బీ స్థలాలను ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు కడుతున్నారు. చెరువు అలుగుకు దగ్గరలో సిమెంటు స్తంభాలు నాటి అక్రమంగా కంచె వేశారు. సబ్‌స్టేషన్ వెనుకభాగంలో గతంలో చిల్లర దుకాణాలు పెట్టి, ఇప్పుడు శాశ్వత నిర్మాణానికి సిద్ధం చేస్తున్నారు. చిన్నఓరంపాడు రెవెన్యూ పొలాలు, రెడ్డిపల్లె చెరువు భూములు, బొమ్మవరం రెవెన్యూ పరిధిలో ఇరిగేషన్, ఆర్ అండ్ బీ భూములను ఆక్రమించి పంట పొలాలు సాగు చేస్తున్నారు. నూకనపల్లె గ్రామ పరిధిలో పట్టా భూములను ఆనుకుని ఉన్న మిగులు భూములను ఆక్రమించి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారని స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. చిన్నఓరం పాడు క్రాస్ నుంచి ఓబులవారిపల్లె వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణకు గురయ్యాయని ఆర్ అండ్ బి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని కమ్మపల్లె, అయ్యలరాజుపల్లె గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయ్యలరాజుపల్లె వద్ద ఓ రైతు గతంలో ఉన్న ఆర్ అండ్ బి రోడ్డును దాటి కొత్త రోడ్డు వరకు స్తంభాలు నాటడంతోపాటు రోడ్డుకిరువైపులా నాటిన రక్షణ స్తంభాలను సైతం తొలగించాడు.బొమ్మవరం చెరువును ఓ వ్యక్తి ఆక్రమించి అరటి పంట సాగు చేస్తున్నాడు. బొమ్మవరం, బి.కమ్మపల్లె క్రాస్ మలుపు వద్ద ఒక రైతు చెరువు కాలువను ఆక్రమించి బొప్పాయి పరిశ్రమ ఏర్పాటు చేశాడు. మలుపు కారణంగా అక్కడ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, కనిపించని కాలువలు, కుంటలు, చెరువులు, విలువైన రోడ్ల పరిస్థితి ఏమిటని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వ నాయకుల బెదిరింపులు, ముడుపులు పుచ్చుకుని చూసీ చూడనట్లు వ్యవహరించిన అధికారులు ఇప్పుడూ అదే మత్తులో ఉన్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వేడుకగా 'అమ్మకు వందనం'



రాయచోటి: తల్లుల ఆశీర్వాదం తీసుకుంటున్న చిన్నారులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వసంత పంచమి సందర్భంగా సోమవారం మారంవాండ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో అమ్మకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి తల్లులకు పాదపూజ చేసి వారి ఆశీర్వాదం పొందారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే వారధిగా విద్యార్థులు ఉండాలని ప్రధానోపాధ్యాయుడు రమేశ్ తెలియజేశారు.ఉపాధ్యాయుడు రామకృష్ణ, పాల్గొన్నారు.

నందలూరు: నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరస్వతి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. తెలుగు ఉపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ వసంత పంచమి విశిష్టతను వివరించారు ఉపాధ్యాయులు ఖాదర్‌బాషా, డాక్టర్ మీసరగండ నాగేంద్రప్రసాద్, శిల్పి ఆనందాచారి, బోగా వెంకటసుబ్బయ్య, విజయ కుమారి, తులసి, తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు: వసంత పంచమి సందర్భంగా మండలంలోని పలు పాఠశాలల్లో సరస్వతి విగ్రహాలకు సోమవారం విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు పూజలు చేశారు. ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు ఎల్లయ్య, రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్ : రాజు ఉన్నత పాఠశాలలో సీఈవో గుంటిమడుగు రఘురామరాజు, హెచ్‌ఎం మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సరస్వతి చిత్రపటాన్ని అలంకరించి పూజలు చేశారు. విద్యార్థులతో వారి తల్లిదండ్రులకు పాదపూజ చేయించారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.ఉపాధ్యాయులు రామసుబ్బారెడ్డి, హబీబ్‌బాషా, క్రిష్ణవేణి, మాలతి, భారతి దేవి, సోని, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆదేశాలతో లో ఓల్టేజీ సమస్య పరిష్కారం



కొత్తపల్లి ప్రాంతంలో పర్యటిస్తున్న విద్యుత్ అధికారులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):లో ఓల్టేజీ కారణంగా విద్యుత్ ఉపకరణాలు కాలిపోతున్నాయంటూ పట్టణంలోని కొత్తపల్లి ప్రాంతవాసులు మంత్రి రాంప్రసాద్ రెడ్డికి విన్నవించడంతో, వెంటనే సమస్య పరిష్కరించాలని ఆయన విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో విద్యుత్ శాఖ ఈఈ, ఏఈఈ కొత్తపల్లిలోని 3, 4, 5, 6 వార్డుల్లో సర్వే నిర్వహించి, త్వరితగతిన గుర్తించిన ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈఈ యుగంధర్, చాంద్‌బాషా, పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రుడి పల్లకి ఉత్సవం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల పల్లకి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి మాఢవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాములు పాల్గొన్నారు

సిమెంటు రోడ్డు పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ, జనసేన నాయకులు

పెనగలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని వెలగచర్ల గ్రా మంలో 18 లక్షల రూ పాయల ఉపాధి హామీ నిధులతో ఏర్పాటు చేస్తు న్న సిమెంటు రోడ్డు ప నులకు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ భూమిపూజ చేశా రు. అబ్బిగారి గోపాల్ రాజంగారి కుమార్, వెంకటసుబ్బయ్య, లేబాక శ్రీనివాసరెడ్డి, బీఎల్ నరసింహారెడ్డి, కొత్త బాలకృష్ణ, రాంప్రసాద్‌నాయుడు, వ కె.కళాచంద్ర, జనసేన మండల కార్యదర్శి గొబ్బూరు హరిరాయల్, బీజేపీ మండల అధ్యక్షుడు కోనేటి రెడ్డి, కృష్ణరాయల్, షమీర్, పతమూరి యానాదయ్యనాయుడు, అబ్బిగారి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

'దాడులు వైసీపీ నేతలకు వెన్నతో పెట్టిన విద్య'



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న యనమల మదన్‌మోహన్, ఎర్రగుడి చంద్రశేఖర్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి); దాడులు, దౌర్జన్యాలు, భూ కబ్జాలు వైసీపీ నేతలకు వెన్నతో పెట్టిన విద్య అని మండల టీడీపీ ఇన్‌చార్జి యనమల మదన్ మోహన్ , ఏఐసీ మాజీ సభ్యుడు ఎర్రగుడి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎంపిపి అంబాబత్తెన రెడ్డెయ్య ఇంటిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేస్తే.. మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తెలుగుదేశం పార్టీపై బురదచల్లడం దారుణమన్నారు. గతంలో రెడ్డెయ్య భూకబ్జాలకు పాల్పడడంతోపాటు, పలువురి నుంచి డబ్బు తీసుకుని, పోలీసుల సాయంతో వారిని బెదిరించి ఇబ్బందులు పెట్టాడన్నారు. ఆయనతో ఇబ్బందులు పడినవారు దాడులకు పాల్పడి ఉండవచ్చన్నారు..దప్పేపల్లె పంచాయతీలో లక్షల విలువ చేసే భూములు ఆక్రమించిన విషయం శ్రీకాంత్ రెడ్డికి తెలిసినా అక్రమార్కులను వెనకేసు కొచ్చారన్నారు. ఈ సందర్భంగా జాండ్రపల్లెకు చెందిన పీట్ల వెంకటలక్షుమ్మ మాట్లాడుతూ తన స్థలంలో అక్రమంగా రోడ్డు వేశారని ప్రశ్నించినందుకు రెడ్డెయ్య ఆయన కుమారులు తనను దూషించడంతో పాటు, అక్రమ కేసులు పెట్టి వేధించారని ఆరోపించింది. అంకన్న అనే వ్యక్తి మాట్లాడుతూ దాడి విషయం తెలుసుకుని రెడ్డెయ్య ఇంటివద్దకు వెళ్లిన తనపై ఆయనతోపాటు, ఆయన కుమారుడు దాడి చేశారని తెలిపారు.

బీసీలపై దాడులు దారుణం

బీసీలపై దాడులకు పాల్పడడం దారుణమని రాయచోటి మాజీ శాసనసభ్యుడు గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. జాండ్రపల్లెలో జడ్పీటీసీ సభ్యురాలు రమాదేవి, మాజీ ఎంపీపీ రెడ్డెయ్య ఇంటిపై కొందరు వ్యక్తులు దాడిచేసిన విషయం తెలుసుకొని సోమవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ బీసీ సామాజికవర్గానికి చెందిన మాజీ ఎంపీపీ రెడ్డెయ్య ఇంటిపై అర్ధరాత్రి దాడి చేయడం అమానుషమన్నారు. చర్యకు ప్రతి చర్య ఉంటుందని హెచ్చరించారు. ఇంత జరిగినా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి వైసీపీ అండగా ఉంటుందన్నారు

కేసు నమోదు

మాజీ ఎంపీపీ అంబాబత్తెన రెడ్డెయ్య ఇంటిపై దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. ఆదివారం రాత్రి ముసుగులు ధరించిన 20 మంది ఇంట్లో చొరబడి అద్దాలు పగులగొట్టి, ద్విచక్ర వాహనానికి నిప్పుపెట్టారని ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసినట్లు ఆయన తెలిపారు

దేవదాయ భూముల ఆక్రమణపై కలెక్టరుకు ఫిర్యాదు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దేవదాయ భూములను ఆక్రమించడమే కాక, ఆలయంలో పని చేస్తున్న అర్చకులను కూడా అడ్డుకుంటున్నారంటూ తంబళ్ల రామమూర్తి అనే వ్యక్తి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. బీ. కొత్తకోట మండలం గట్టు గ్రామంలోని రెడివారిపల్లె వద్ద ఉన్న భీమేశ్వర , సుబ్రహ్మణేశ్వరాలయాలకు అదే గ్రామానికి చెందిన సర్వే నెంబరు 460లోని 4.70 సెంట్లను భాస్కర్ రెడ్డి, శివారెడ్డి, సిద్దారెడ్డి అనే వారు రెవెన్యూ వారి సహకారం తో ఆక్రమించుకున్నారని, పాపని చెరువులో ఉన్న సుబ్రహ్మణ్యాలయానికి చెందిన భూములు కూడా ఆక్రమించేందుకు సిద్ధమయ్యారని ఫిర్యాదులో పేర్కొన్నాడు.. ఈ విషయాలపై రెవె న్యూ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని విన్నవించారు. తమ భూములను ఆన్‌లైన్ చేయకుండా ఏడాది కాలంగా తిప్పుతున్నారని గుండ్లమడుగు గ్రామానికి చెందిన ఎర్ర వెంకట్రమణ నాయుడు అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. తన తండ్రి మరణానంతరం ఆయన అనుభవంలోని భూములు తమ పేరుతో ఆన్‌లైన్ చేయకుండా, వీఆర్వో, ఎంఆర్వో లంచాలు తీసుకుని ఇతరుల పేరుతో ఆన్‌లైన్ చేయడానికి సిద్దపడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నాడు.



నేడు లక్ష్మీవెంకటేశ్వర కల్యాణోత్సవం

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రామ్‌నగర్‌లో మంగళవారం ఉదయం 10.30 గంటలకు తిరుమలగిరి లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ కోడూరు చలపతి, వైస్ ఛైర్మన్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. లోకకల్యాణం కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి భక్తులందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఉదయం ఆరు గంటలకు సుప్రభాతం, దేవాలయ తోరణ అలంకరణ, 8 గంటలకు యాగశాల ప్రవేశం, గణపతి పూజ, దీక్షా కంకణధారణ, అఖండ జ్యోతి ప్రజ్వలన ఉంటుందన్నారు. 10.30 గంటల నుంచి కల్యాణోత్సవం అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేస్తారన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదం, సాయంత్రం 4 గంటలకు కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

లారీ చోరీ కేసులో నిందితుడికి రిమాండ్

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుక్కలదొడ్డి వద్ద గత నెల 28న చోరీకి గురైన లారీని స్వాధీనం చేసుకుని తెలంగాణ రాష్ట్రం గద్వాల్ జిల్లా మానోపాడ్‌కు చెందిన షేక్ మౌలాలిని అరెస్టు చేసినట్లు సీఐ కె.హేమసుందర్ తెలిపారు. నిందితుడిని సోమవారం కోర్టులో హాజరు పరచగా రైల్వేకోడూరు జూనియర్ సివిల్ జడ్జి తేజ సాయి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

రాజంపేట సబ్‌కలెక్టర్‌కు వినతుల వెల్లువ

రాజంపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట సబ్‌కలెక్టర్‌కు సోమవారం భూ సమస్యలపై పెద్దఎత్తున వినతులు అందాయి. సబ్ కలెక్టర్ నిదియాదేవి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత తహసీల్దారులను ఆదేశించారు. తన పరిధిలోని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.

'విద్యార్థి' నాయకులను విడుదల చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి



సీఐకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 3 (ఆంధజ్యోతి): విద్యార్థుల సమస్యలపై ప్లకార్డులు ప్రదర్శించినందుకు అరెస్టు చేసిన ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పండుగోల మణి డిమాండ్ చేశారు. సోమవారం ఆయా విద్యార్థుల పై కేసులు ఎత్తివేయాలంటూ స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 1న సంబేపల్లెలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొన్న కార్యక్రమంలో ప్లకార్డులు ప్రదర్శించినందుకు అరెస్టు చేసిన విద్యార్థులను పోలీసులు తీవ్రంగా కొట్టారన్నారు. అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేసి కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా పోలీస్‌స్టేషన్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం రైల్వేకోడూరు సీఐ కే. హేమసుందర రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సీపీఐ కార్యదర్శి దార్ల రాజశేఖర్, నాయకులు దాసరి జయచంద్ర, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం మానుకోవాలి: జనసేన

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు మానుకోవాలని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి తాతంశెట్టి నాగేంద్ర, నాయకులు జోగినేని మణి, సర్పంచ్ కారుమంచి సంయుక్త వైసీపీ నేతలకు హితవు పలికారు. సోమవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు పరుగులు తీస్తున్నాయనేది వైసీపీ గుర్తించాలని తెలిపారు. 2085 సర్వే నెంబరులో ఉన్న ప్రభుత్వ వంక పోరంబోకు కబ్జానుంచి రక్షించడానికి పోరాటాలు చేశామన్నారు. ముస్లింలను కల్లబొల్లి మాటలతో వైసీపీ మోసం చేసిందన్నారు. ఈద్గా విషయంలో కూడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి ఆదేశాలకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. తనను ప్రజలు తిరస్కరించి ఏడు నెలలైనా ఇంకా తానే ఎమ్మెల్యే అనే భ్రమలో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఇంకా ఉన్నారని విమర్శించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ భజన మాని ఇప్పటికైనా విధానపరమైన సూచనలతో రైల్వేకోడూరు అభివృద్ధికి కలసి రావాలని కోరారు. జనసేన నాయకులు పగడాలవెంకటేష్, పగడాల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పంచముఖ వినాయక విగ్రహ ప్రతిష్ఠ



కార్యక్రమానికి హాజరైన చమర్తి

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మదన గోపాలపురం పంచాయతీరాజ్ అతిథి గృహంలో సోమవారం పంచముఖ వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్య క్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్ నాయుడు, టీడీపీ నా యకులు బాపనయ్యనాయుడు, నాగేశ్వర నాయుడు, దగ్గుబాటి సుబ్రమణ్యం నాయుడు, ప్రతాప్‌రాజు, సతీష్‌రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో టీడీపీ కార్యాలయం ప్రారంభం



టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సోమవారంతెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ప్రారంభించారు. అనంతరం తన చాంబర్‌లో సీఎం సహాయనిధి కోసం అందజేసిన అర్జీలను స్వీకరించారు. మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు పొందూరు కొండయ్యనాయుడు, బాసినేని వెంకటేశ్వరు నాయుడు, జిల్లా టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యా సంస్థల కరస్పాండెంట్ ఎస్వీ రమణ, మండల టీడీపీ నాయకులు నాగేశ్వర్‌నాయుడు, మేకా నరసింహులు, మైనార్టీ నాయకులు గుల్జార్‌బాషా, కూచివారిపల్లె నాయకులు దగ్గుపాటి రవికుమార్‌నాయుడు, అగ్రహారం నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

సంబేపల్లె, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గున్నికుంట్ల పంచాయతీ దిగువ రాచపల్లెలోని ఆలయంలో సోమవారం సీతారామ లక్ష్మణ, హనుమంత విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలు దైవభక్తిని పెంపొందిస్తాయన్నారు. అనంతరం గ్రామస్తులు ఆయనను గజమాల, శాలువాతో సన్మానం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. మాజీ సర్పంచ్ సిద్దారెడ్డి, అచ్చిరాజు,రామరాజు, వెంకటశివరాజు, వెంకట్రామరాజు, సాయి, విశ్వనాథ రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రవీంద్రరాజు, శేఖర్, రామరాజు పాల్గొన్నారు.

చెన్నయ్యగారిపల్లెలో వైద్యశిబిరం

నందలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రచెరువులపల్లె గ్రామ పంచాయతీ చెన్నయ్యగారిపల్లె బీసీ కాలనీలో మండల వైద్యాధికారి డాక్టర్ కె.శరత్‌కమల్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య, ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్‌కమల్ మాట్లాడుతూ వైద్య శిబిరంలో 30 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రజని, ఏఎన్ఎం నాగమణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు బండలాగుడు పోటీలు

నందలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుంపిణీపురం భోగాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ తేదీ బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీ విజేతలకు మొదటి బహుమతి రూ.50 వేలు, 2వ బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, 4వ బహుమతి రూ.20 వేలు, 5వ బహుమతి రూ.10 వేలు, 6వ బహుమతి రూ.7 వేలు, 7వ బహుమతి 5 వేల రూపాయలు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు గణపతి శంకర్, సంభావు చంద్రశేఖర్ తెలిపారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి); అంగన్‌వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యకర్తల యూనియన్ అధ్యక్షురాలు సుకుమారి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట కార్యకర్తలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లింపు, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ వంటనే జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గుజరాత్ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల ఉద్యోగాను క్రమబద్ధీకరించాలన్నారు. 7వ పే కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా కనీస వేతనం 26 వేలు చెల్లించాలన్ని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షురాలు ప్రభావతి, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు

రైతు సేవా కేంద్రాల్లో ఏడీఏ తనిఖీ

సిద్దవటం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాచుపల్లె, టక్కోలు రైతుసేవా కేంద్రాలను సోమవారం ఏడీఏ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14వ తేదీలోగా ఈ పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఆకుల వంశీ, శివఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మామిడికి పొగమంచు దెబ్బ

- దోబూచులాడే మబ్బులతో కానరాని మామిడి పూత
- దిగుబడి తగ్గుతుందని రైతుల దిగాలు
- ఈ ఏడాది రైతన్నకు నష్టాలే
- తగ్గనున్న మామిడి వ్యాపారం

రాజంపేట/పెనగలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది మాదిరే ఈ ఏడాది కూడా ప్రకృతి మామిడి రైతుపై కన్నెర్ర చేస్తోంది. ఈ ఏడాది కూడా మామిడి దిగుబడి భారీగా తగ్గనుంది. రైల్వేకోడూరు మార్కెట్ యార్డు ఆధారంగా కోడూరు, రాజంపేట నియోజకవర్గాల్లో ప్రతియేటా మామిడి పంటతో జరిగే 200 కోట్ల వ్యాపారానికి గండి పడనుంది. డిసెంబరు, జనవరి నెలల్లో మామిడి పూత వస్తుంది. డిసెంబరులో ఒక మోస్తరు పూత వస్తే జనవరి నాటికి పూర్తి స్థాయికి వచ్చి ఫిబ్రవరి నుంచి మార్చి నాటికి పిందెలు ఏర్పడి ఏప్రిల్ నుంచి మామిడికాయలు మార్కెట్‌లోకి వస్తాయి. అటువంటిది ఈ ఏడాది డిసెంబరులో ప్రకృతి పూర్తిగా మామిడి రైతుపై కన్నెర్ర చేసింది. డిసెంబరు నుంచి ప్రతిరోజూ మబ్బులు రావడం, అందునా ప్రతిరోజు పొగ మంచు రావడం, అప్పుడప్పుడూ చిరుజల్లులు పడ్డాయి. జనవరిలో వచ్చే పెద్ద పండుగ మూడు రోజులు కూడా ఆ తర్వాత రోజులు ఒక మోస్తరు వర్షం కురిసింది. జనవరి నెలలో వర్షం కురవడం అన్నది ఎప్పుడూ జరగదు. వాతావరణంలో జరుగుతున్న పెనుమార్పుల వల్ల మామిడి పూత దశ వచ్చే డిసెంబరు, జనవరి నెలల్లో విపరీతంగా మంచు కురవడం, దట్టంగా పొగమంచు రావడం, చిరుజల్లులు కురవడం శాపంగా మారింది. దీనివల్ల ప్రధానంగా రైల్వేకోడూరు మండలంలోని 20 వేల ఎకరాల్లో సాగయ్యే మామిడి పంట 30 శాతం కూడా పూత పూయలేదు. ఇక చిట్వేలి, పెనగలూరు మండలాల్లో సుమారు 5 వేల ఎకరాల్లో మామిడి పంటకు పూత రాలేదు. వచ్చినా 30 శాతం మించలేదు. ఇక వీరబల్లె, రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె మండలాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ ప్రాంతంలో అత్యంత ఎక్కువ వ్యాపారం జరిగేది ఈ ప్రాంతంలో మామిడి ద్వారానే. సుమారు 30 వేల ఎకరాల్లో ఈ ప్రాంతంలో మామిడి పంట ఉంది. బేనీషా, మలుగుబ, రుమాని, తోతాపూరి, అంటిమామిడి, పునాస, నీలం ఇలా 30 రకాల పైబడి మామిడి పంట పండుతోంది.

దేశంలోని చెన్నై, ముంబాయి, బెంగుళూరు, ఇతర ప్రధాన నగరాలతో పాటు ఇతర దేశాలకు కూడా ఇక్కడి నుంచి ఎగుమతి అవుతూ ఉంటాయి. ప్రతిరోజు 10 లారీల నుంచి 30 లారీల వరకు ఎగుమతి అవుతాయి. అటువంటి పంటకు ప్రకృతి సహకరించకపోవడంతో భారీ ఎత్తున దిగుబడి తగ్గే అవకాశం ఉంది. దీని వల్ల ఆరుగాలం కష్టించి అప్పులు చేసి పెద్దఎత్తున మందులు పిచికారీ, సాగు ఖర్చులు పెట్టుకుని దిగుబడి వస్తుందన్న మామిడి రైతులకు ఈ ఏడాది కూడా నిరాశే మిగిల్చింది. గత ఏడాది మామిడి పంట 30 శాతం కూడా దిగుబడి రాలేదు. దానికి కారణంగా ప్రకృతి కనికరించకపోవడమే. 2023లో భారీఎత్తున ఎవరూ ఊహించని రీతిలో పంట దిగుబడి వచ్చినా అంతర్జాతీయ మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో ఉపయోగం లేకుండా పోయింది. పంట బాగా పండితే గిట్టుబాటు ధర లేకపోవడం, గిట్టుబాటు ధరలు ఉన్నప్పుడు పంటలు పండకపోవడం వంటి కారాణాల వల్ల ప్రతియేడాది మామిడి రైతులు భారీ ఎత్తున నష్టపోతున్నారు. చేసేది లేక కొందరు మామిడి రైతులు మామిడి పంటను తీసివేసి ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపే పరిస్థితి ఏర్పడింది.

ఇందులో భాగంగా అక్కడక్కడ మామడి తోటలను తీసివేయడం చేశారు. ఎండలు బాగా కాస్తేనే పూత బాగా వస్తుంది. మామిడి పూత రావడానికి రెండే ప్రధాన ఆధారం. అటువంటిది డిసెంబరు, జనవరి నెలలో మబ్బులు, చిరుజల్లులు, ప్రధానంగా పొగమంచు పూత రాకుండా చేస్తోంది. మామూలుగా ఒక ఎకరా మామిడి తోట బాగా పండితే పెట్టుబడి పోను కనీసం లక్షన్నర రూపాయలు ఆదాయం వస్తుంది. అటువంటిది పెట్టిన పెట్టుబడులు కూడా ఈసారి కూడా వచ్చే పరిస్థితులు కనిపించకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.



పెనగలూరు మండలంలోని తూర్పుపల్లె అటవీ ప్రాంత మామిడి తోటను కప్పేసిన పొగమంచు



రాజంపేట ప్రాంతంలో అరకొరగా వచ్చిన మామిడి పూత



పూతరాకుండా అలంకార ప్రాయంగా ఉన్న మామిడిచెట్లు

వెంటనే అప్రమత్తమైతే పూత పెరగొచ్చు



రైతులు తమ మామిడి తోటల్లో పూత రాకపోతే వెను వెంటనే కొన్ని మెళకువలు పాటిస్తే పూత పెరుగుతుంది. ప్రధానంగా పూత రాని తోటల్లో పూమొగ్గలు ఉత్తేజపరిచి పూత రావడానికి ఆడపూల శాతం పెరగడానికి పొటాషియం నైట్రేట్, ఫార్ములా-4 లేదా ఆర్గాన్ మ్యాంగో స్పెషల్ లీటరు నీటికి తగు మోతాదులో పిచికారీ చేయాలి. పూమొగ్గ దశలో తేనెమంచు పురుగు, పక్షి కన్ను తెగులు ఆశించే అవకాశం అధికంగా ఉన్నందున మోనోక్రోటోపాస్, కార్బానిజం, వేపనూనె తగు మోతాదులో కాండం, కొమ్మలు బాగా తడిచేలా పిచికారి చేస్తే బాగా పూత వస్తుంది.

- సురేష్‌బాబు, ఉద్యాన శాఖ అధికారి, రాజంపేట.

40 ఎకరాల్లో నాలుగెకరాల్లో కూడా పూత రాలేదు



40 ఎకరాల్లో మామిడి పంట మాకు ఉంటే అందులో నాలుగెకరాల చెట్లకు కూడా పూత రాలేదు. ఎకరాకు వంద చెట్లు ఉంటే కనీసం 5 చెట్లకు కూడా పూత రాలేదు. వచ్చినా ఒకటిరెండు చోట్ల వచ్చి అది కూడా పూత రాలిపోతోంది. ఎకరాకు 20 వేలు ఖర్చు చేసి 40 ఎకరాలు సాగు చేస్తే సుమారు 10 లక్షలు ఖర్చయింది. ఫిబ్రవరి నాటికి పూత 30 శాతం కూడా రాకపోవడంతో మామిడిపై పెట్టుకున్న ఆశలు నిరాశలవుతున్నాయి. గత ఏడాది 5 లక్షలు కూడా రాలేదు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి ఉంది. ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఎంత ఖర్చు చేసినా పూత రాకపోవడంతో మా ఆశలు ఈ ఏడాది కూడా నెరవేరేటట్లు లేదు.

-తుమ్మలకుంట ఈశ్వర్‌కుమార్, మామిడి రైతు, నాగిరెడ్డిపల్లె గ్రామం


పూత మాగిపోయింది



మా భూములు పండ్ల తోటలు చెయ్యేటి పరివాహక ప్రాంతంలోనే ఉన్నాయి. మా ప్రాంతమంతా ఎప్పుడూ చలి ప్రాంతంగా ఉంటుంది. అందువల్ల సీజన్ మారిపోయినా కొన్ని రకాల మామిడి చెట్లలో సకాలంలోనే పూత వచ్చింది. పుష్కలంగా పూత వస్తుందని ఆశపడ్డ రోజులు జరుగుతుండగా పూత మగ్గిపోతోంది. శాస్త్రవేత్తలను ఆశ్రయించాల్సి వచ్చింది.

- డి.శివకుమార్‌రెడ్డి, నర్సింగరాజపురం, పెనగలూరు

తలకు మించిన భారంగా ఖర్చులు



నాకు ఉన్న మామిడితోటకు ఖర్చులు యేటా తలకుమించిన భారంగా మారాయి. రెండేళ్లలో మామిడి తోటల్లో సేద్యపు ఖర్చులు, మందుల పిచికారీ ఖర్చులు పెరిగిపోయాయి తప్పితే దిగుబడి మాత్రం రాలేదు. ఈ ఏడాది అయినా 10 రూపాయలు కళ్లు చూద్దామనుకుంటే తికమక వాతావరణంతో ఇంకా పూత రాలేదు. అయినా సరే వ్యవసాయంపై ఉన్న మక్కువ వదలను.

- బద్దల వెంకటయ్య, రైతు, సాతపల్లె, పెనగలూరు

వంకను పూడ్చేశారు...

- వంకలో మట్టి తోలి తన భూమిలో కలుపుకున్న ఘనుడు

సిద్దవటం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : తన పొలానికి ఆనుకుని ఉన్న వంకను సైతం ఓ రైతు ఆక్రమించుకుని తన భూమిలో కలిపేసుకున్నాడు. వర్షాకాలంలో ఈ వంక నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తూ పెన్నానదిలో కలుస్తుంది. అటువంటి వంకను దాదాపు సగం పూడ్చివేసి కాలువలాగా మార్చివేసి దాదాపు 50 సెంట్లకు పైగా వంక స్థలాన్ని కబ్జా చేశాడు. కడప-పోరుమామిళ్ల రహదారి సిద్దవటం గ్రామం రెవెన్యూ పొలం సర్వే నెంబరు 378, 54/1, 54/2లో సుమారు ఐదెకరాలు పట్టా కలిగిన కడప నగరానికి చెందిన ఓ రైతు తన పొలానికి ఆనుకున్న ఉన్న వంకను పూడ్చివేసి దాదాపు 50 సెంట్లకు పైగా తన స్థలంలో కలుపుకున్నాడు. ఆ స్థలంలో చదును చేసి ప్లాట్లు వేస్తున్నాడు. రెవెన్యూ అధికారులు కూడా ఆ భూమికి హద్దులు ఏర్పాటు చేసిన రాళ్లను నాటినా వాటిని దాటుకుని వంక స్థలాన్ని కూడా ఆ రైతు చదును చేసి తన పొలంలో కలుపుకున్నాడు. డిసెంబరు నుంచి ఈ వ్యవహారం జరుగుతున్నా అధికారులు ఎవరూ అటువైపు కన్నెత్తి కూడా చూడలేదన్న విమర్శలున్నాయి. ఎగువ ప్రాంతమైన అవసరకోన, కోతి రాయికొండ, దుర్గమ్మకోన ప్రాంతాల నుంచి వర్షాకాలంలో వచ్చే నీటితో ఈ వంక ఉధ్రుతంగా ప్రవహిస్తూ పెన్నానదిలో కలుస్తుంది. ఇటువంటి వంకను పూడ్చివేయడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు. వంక కబ్జా విషయమై ఇరిగేషన్‌శాఖ ఏఈ సాయిక్రిష్ణను వివరణ కోరగా ఈ విషయం మా దృష్టికి రాలేదని, వంక అన్యాక్రాంతం అయి ఉంటే స్థానిక తహశీల్దారు ఆధ్వర్యంలో సర్వే చేసి అన్యాక్రాంతం అయిన వంక స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.



వంకను కబ్జా చేసి తోలిన మట్టి

హంద్రీ-నీవా ప్రాజెక్టు సామర్థ్యం పెంచాలి

- చిప్పిలి ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం పూర్తిచేయాలి
- సబ్‌కలెక్టరేట్ ఎదుట సీపీఐ రాష్ట్ర నాయకుల ధర్నా

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్ర జ్యోతి): రాయలసీమలోని అనంతపురం, ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యవసాయ భూములకు సాగునీరు, పట్టణాలకు తాగునీరు అందించే హంద్రీ-నీవా ప్రాజెక్టు నీటిపారుదల సామర్థ్యం పెంచాలని సీపీఐ రాష్ట్ర నాయకులు జి.ఈశ్వరయ్య, రామానాయుడు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ రాయలసీమకు కృష్ణానది జలాలు తీసుకురావడానికి 20 ఏళ్ల క్రితం ప్రారంభించిన హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులు రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఇంత వరకు సంపూర్తి కాలేదన్నారు. 6లక్షల ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందించేందుకు రూపొందిస్తున్న ఈ ప్రాజెక్టులో అనంతపురం జిల్లాలో 3.45లక్షల ఆయకట్టు భూములకు సరిపడా హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ తవ్వలేదన్నారు. మొత్తం భూములకు సాగునీరు అందించాలంటే 10వేల క్యూసెక్కుల సామర్థ్యంతో హంద్రీ-నీవా కాలువ వెడల్పు చేయాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు మాట్లాడుతూ హంద్రీ-నీవాకు సమాంతరంగా కాలువ తవ్వాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు మాట్లాడుతూ మదనపల్లె పట్టణానికి తాగునీరు అందించేందుకు నిర్మిస్తున్న చిప్పిలి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నిర్మాణ పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం హంద్రీ-నీవా ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయకుండా మూలన పడేసిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వమైనా ఈ ప్రాజెక్టును ఆరు నెలల్లో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన సేన శ్రీచందు, సీపీఐ నాయకులు కృష్ణప్ప, సాంబశివ, మురళి, మనోహర్‌రెడ్డి, సుధీర్, వెంకటేశ్ రంగారెడ్డి, హరి, సురేష్‌కుమార్, తిరుమల, సలీమ్ తదితరులుపాల్గొన్నారు.



సబ్‌కలెక్టరేట్ ఎదుట సీపీఐ మహాధర్నాలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరయ్య

10న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఉచితంగా అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అన్ని అంగన్వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో అల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల మాత్రలు పంపిణీ చేస్తారని, దీని ద్వారా నులిపురుగుల సంక్రమణను సులభంగా నిర్మూలించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులందరూ వారి పిల్లలకు మాత్రలను అందేవిధంగా చేసి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఎస్‌డీసీ రమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శైలజ, ఆ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సహకార సంవత్సర గోడపత్రిక ఆవిష్కరణ

ఐక్యరాజ్యసమితి-2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా గుర్తించిన నేపథ్యంలో సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా సహకారశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను కలెక్టర్ శ్రీధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025వ సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ సహకార సంవత్సరంగా గుర్తించిందని, సహకార సంఘాలు మెరుగైన ప్రపంచాన్ని నిర్మిస్తాయి అని ఐక్యరాజ్యసమితి ఈ సంవత్సరానికి ప్రకటించిందన్నారు. జిల్లాలో సహకార కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించిన విధంగా జరపాలని జిల్లా సహకార అధికారిని, ఆ శాఖ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, ఎస్‌డీసీలతో పాటు జిల్లా సహకారశాఖ అధికారి గురుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయొద్దు

- విద్యాశాఖ ఉన్నతాధికారులకు యూటీఎఫ్ అన్నమయ్య జిల్లాశాఖ వినతి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబర్ 117కు ప్రత్యామ్నాయ మార్గదర్శకాల పేరుతో చేస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విలీనాన్ని ఆపాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయవద్దని విద్యాశాఖ ఉన్నతాధికారులకు యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. సోమవారం రాయచోటిలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, షేక్. జాబీర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్నాయన్నారు. గత ప్రభుత్వం జీవో నెంబర్ 117తో ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి ప్రభుత్వ విద్యా వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నాటి తప్పులను సరిచేసి విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటామని నాయకులు తెలిపారన్నారు. అయితే గత ప్రభుత్వం తరగతులను విలీనం చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం పాఠశాలలనే విలీనం చేస్తోందని ఆరోపించారు. ఒక పంచాయతీలోని ప్రాథమిక పాఠశాలలను అన్నింటినీ విలీనం చేసి, ప్రాథమికోన్నత పాఠశాలల మనుగడే లేకుండా చేస్తోందన్నారు. ఫలితంగా భవిష్యత్తులో మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 60 పైగా ఉన్నా, తగినన్ని తరగతి గదులు మౌలిక వసతులు లేకపోతే వాటిని ఐదు కిలోమీటర్ల లోపు దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో కలిపివేస్తామనడం ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు నిదర్శనమన్నారు. మౌలిక వసతులు, మూడు కిలోమీటర్ల దూరంలో సంబంధం లేకుండా 60 మంది విద్యార్థులు పైబడి ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలన్నింటినీ ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. 60 పైబడి విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రైమరీగా తీర్చిదిద్దడమే కాకుండా, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులను కూడా నియమించాలని, ఉన్నత పాఠశాలల్లో 40 మంది విద్యార్థులకు ఒక సెక్షన్‌గా నిర్ణయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు శివారెడ్డి, కోశాధికారి చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్లు చెంగల్‌రాజు, శివారెడ్డి, జిల్లా కార్యదర్శులు వెంకట్రమణ, వెంకటసుబ్బయ్య, శ్రీధర్‌రెడ్డి, అక్రంబాషా, ఆదినారాయణ, దావుద్దీన్, ప్రచురణల విభాగం జిల్లా కన్వీనర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

బి.కొత్తకోట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగుచూసింది. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. బి.కొత్తకోట మండలం బయ్యప్పగారిపల్లె పంచాయతీ పప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన పీవీ శేఖర్‌రెడ్డి భార్య కవిత(33) అంగళ్లులోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో అటెండర్‌గా పనిచేస్తోంది. శేఖర్‌రెడ్డితో మేనరికం కారణంగా వివాహమైంది. వారికి పదహారేళ్ల కుమారుడు ఉన్నాడు. గత కొంత కాలంగా భార్యభర్తల మధ్య ఫోన్ మెసేజ్‌ల కారణంగా మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో ఆమె వ్యవసాయ పొలం వద్ద ఉన్న బావిలో శవమై తేలింది. సీఐ జీవన్ గంగనాథ్ బాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. కవిత చిన్నాన్న శంకర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిమెంట్ లారీ బోల్తా - డ్రైవర్ మృతి



రోడ్డుపై పక్కకు ఒరిగి పడిపోయిన సిమెంట్ లారీ, (ఇన్‌సెట్లో) డ్రైవర్ రాజు

కాశినాయన, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రాపురం వద్ద సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ రాజు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ హనుమంతు వివరాల మేరకు.. ఒంగోలు జిల్లాలోని కంభం మార్కాపురంలో సిమెంట్ లోడు లారీ ప్రొద్దుటూరుకు వెళ్తూ పోరుమామిళ్ల- ఖైదుకూరు ప్రధాన రహదారిపై సోమవారం ప్రమాదానికి గురైందన్నారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ రాజు (50) అక్కడికక్కడే మృతిచెందగా, క్లీనర్ ప్రాణాలతో బయటపడ్డాడని తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రస్తుతం ప్రమాదం జరిగిన ప్రాంతంలో తారురోడ్డు పనులు జరుగుతున్నాయి. రోడ్డు ఎత్తు తగ్గులు ఉండడంతో లారీ పక్కకు ఒరిగి పడిపోయినట్లు సమాచారం. ఈ ప్రమాదం జరిగిన కూతవేటు దూరంలోనే ఓ పెద్ద ట్రాన్స్‌ఫారం ఉంది. ఒకవేళ దాన్ని ఢీకొన్నట్లయితే పెనుప్రమాదం జరిగి ఉండేది.

మృతుడి వివరాలు గుర్తింపు

కొండాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కొండాపురం పంప్‌హౌస్ సమీపంలో ఆదివారం రైలుకింద పడి మృతిచెందిన వ్యక్తి వివరాలను సోమవారం ఎర్రగుంట్ల రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుడు పులివెందులకు చెందిన మల్లేపల్లి రంగనాథ్‌గా గుర్తించారు. ఇతను గత కొంతకాలంగా పక్షవాతం వ్యాధితో బాధపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లిదండ్రుల స్వస్థలం చౌటిపల్లె కావడంతో ఇక్కడికి వచ్చి అనారోగ్య సమస్యలతో రైలుకింద పడి మృతిచెంది ఉండవచ్చని పోలీ సులు భావిస్తున్నారు. కాగా ఇతనికి భార్యతో పాటు ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో మృత దేహానికి పోస్టు మార్టం నిర్వహించినట్లు రైల్వే ఎస్సై సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

అతివలు... అక్షర వెలుగులు

- మహిళల వికాసానికి ఉల్లాస్
- ప్రారంభమైన బోధనా తరగతులు
- అక్షరజ్ఞానం, దైనందిన విషయాలపై అవగాహన




నరసింహాపురంలో మహిళల విద్యాభ్యాసం

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు. మహిళలు అక్షరాస్యత సాధిస్తేనే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుంది. కానీ గ్రామీణ ప్రాంతాల్లో నేటికి చాలా మంది అతివలు నిరక్షరాస్యులుగా మిగిలిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులకు చదవడం, రాయడంతో పాటు డిజిటల్ లావాదేవీలు అలవాటు చేసేందుకు 'ఉల్లాస్' (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) అనే పేరుతో వయోజన విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మారుతున్న కాలానికి అనుగుణంగా వీరందరికీ అక్షరజ్ఞానం కలిగించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ప్రధాన లక్ష్యం. 15 ఏళ్ల వయస్సు పైబడి ప్రాథమిక విద్యకు నోచుకోని వారు మధ్యలోనే బడి మానేసి అక్షరాలను మరచిపోయిన వారిని గ్రామస్థాయిలో గుర్తించారు. ఇందుకు కార్యాచరణ, రూపకల్పన చేసి క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నారు.

విద్యావంతులకు శిక్షణ

ఎలాంటి లాభాపేక్ష లేకుండా స్వచ్ఛందంగా చదువు చెప్పడానికి పొదుపు సంఘాల్లో ఆసక్తి ఉన్న మహిళలు యువతులను గుర్తించి వారికి ఇప్పటికే మండల స్థాయిలో శిక్షణ ఇచ్చారు. పాఠ్యాంశ సామగ్రిని అందజేశారు. ప్రతి గ్రామంలో పొదుపు సంఘాల్లో నిరక్షరాస్యులైన 10 మంది సభ్యులకు ఒక వలంటీరు అక్షరాలతో పాటు సంతకాలు చేయడం నేర్పిస్తారు. వర్ణమాల, లెక్కలు కట్టడం, బ్యాంకు లావాదేవీల నిర్వహణ వంటి పలు అంశాలతో పాటు డిజిటల్ చెల్లింపులు, మొబైల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ చెల్లింపులు, తదితర అక్షరాస్యతపైన పూర్తిస్థాయిలో అవగాహన ఇస్తున్నారు. ఇందుకు గ్రామాల్లో వెసులుబాటు ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, అందరికి ఆమోద యోగ్యమైన ప్రదేశాల్లో ప్రత్యేక తరగతుల విద్యాబోధనకు సిద్ధం చేశారు.



నిరక్షరాస్యులకు బోధించే పుస్తకం

నిరక్షరాస్యుల ఎంపిక

ఉమ్మడి కడపజిల్లాలో 65 మండలాల్లోని 36,937 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకు 3,693 కేంద్రాలకు వలంటీర్లను నియమించారు. వలంటీర్లలో పొదుపు సంఘాలకు వీఓఏలు కూడా విద్యాబోధన చేసేందుకు తగిన తర్ఫీదునిచ్చారు. వీరు ప్రతిరోజు సుమారు రెండు గంటలపాటు నిరక్షరాస్యులకు బోధనా తరగతులు నిర్వహిస్తారు. బోధనకు జిల్లా వ్యాప్తంగా మార్గదర్శక వాచకం, అక్షర వెలుగు సంక్షిప్త వాచకం, అభ్యాసపు హాజరు పట్టీలు అందించారు. వీటినన్నింటినీ మండల కేంద్రాల నుంచి అన్ని గ్రామీణ ప్రాంతాల్లోని వయోజన విద్యాకేంద్రాలకు సరఫరా చేశారు. స్వయం సంఘాల్లో వీఓఏలను వలంటీర్లుగా ఎంపిక చేసి వారి ద్వారా గ్రామాల్లో బోధన అందిస్తున్నారు. జనవరి 27 నుంచి ప్రారంభమైన ఈ శిక్షణ తరగతులు మార్చి నెల 18 నాటికి శిక్షణ ప్రక్రియ పూర్తిచేయనున్నారు. ఈ ప్రత్యేక శిక్షణ తరగతుల ప్రక్రియపై వివిధ శాఖల అధికారులను పర్యవేక్షకులుగా నియమించారు. వయోజన విద్య సజావుగా సాగేలా వీరు పర్యవేక్షించనున్నారు.

అక్షర వెలుగులు నింపుతాం

- వెంకటసుబ్బమ్మ, వెలుగు ఏపీఎం, ప్రొద్దుటూరు మండలం

మహిళలు డిజిటల్ మోసాలకు గురికాకుండా అవగాహన కల్పిస్తున్నాం. తెలుగుభాష, గణితంతో పాటు దైనందిన వినియోగానికి సంబంధించిన నైపుణ్యాలను పెంపొందిస్తాం. ప్రొద్దుటూరు మండలంలో 1700 మంది నిరక్షరాస్యులను గుర్తించాం. వీరికి 170 మంది వలంటీర్లతో రోజుకు గంటన్నరపాటు బోధన జరిగేలా పర్యవేక్షణ ఉంటుంది. శిక్షణ కాల పరిమితి పూర్తయ్యే నాటికి అతివల్లో అక్షర వెలుగులను నింపుతాం.

దస్తగిరిరెడ్డిపై దాడి కేసులో నిందితుల అరెస్టు

- ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి
- పులివెందుల డీఎస్పీ మురళి



మాట్లాడుతున్న డీఎస్పీ మురళి

పులివెందులటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలం ఇనగనూరు గ్రామానికి చెందిన దస్తగిరిరెడ్డిపై గత నెల 29న జరిగిన దాడి కేసులో నలుగురు నిందితులకు గానూ ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ మురళీనాయక్ తెలిపారు. సోమవారం అర్బన్ పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 29న ఇనుగనూరు గ్రామానికి చెందిన దస్తగిరిరెడ్డి అలియాస్ బాబురెడ్డి సొంత పనినిమిత్తం పులివెందులకు వచ్చారు. తన పని పూర్తి చేసుకుని తిరిగి స్వగ్రామానికి వెళుతున్న సమయంలో గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన మొరంరెడ్డి సమరసింహారెడ్డి, మొరంరెడ్డి హరికిశోర్‌రెడ్డి అలియా కిశోర్‌కుమార్‌రెడ్డి, మోరంరెడ్డి బాల ఓబుల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి కాపు కాచి దాడి చేశారు. ఈ దాడిలో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసుకు సంబంధించి ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు పులివెందుల డీఎస్పీ మురళీ నేతృత్వంలో పులివెందుల రూరల్ సీఐ రమణ ఆధ్వర్యంలో సింహాద్రిపురం ఎస్‌ఐ తులసి నాగ ప్రసాద్, తొండూరు ఎస్‌ఐ చిన్న ఓబన్న వారి సిబ్బంది కలిసి సైదాపురం క్రాస్ రోడ్డు, పులివెందుల ముద్దనూరు మెయిన్ రోడ్డు తొండూరు మండలం వంతెనపై ఉన్న ముగ్గురు నిందితులను గుర్తించి సోమవారం ఉదయం అరెస్టు చేసినట్లు తెలిపారు. కాగా బాధితుడు, నిందితులందరూ ఇనగనూరు గ్రామానికి చెందిన వారేనని, వ్యవసాయ పొలంలో వేసిన 350 చీనీ చెట్లకు కరువు పని బిల్లులు చేయించుకునే విషయమై మనస్పర్థలు వచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలో దస్తగిరిరెడ్డిని ఎలాగైనా చంపాలని నిర్ణయించుకుని, ముందుగా అనుకున్న ప్రకారం గత నెల 29న ఉదయాన్నే తన పని మీద మోటారు సైకిలుపై పులివెందులకు వెళ్తుండడంతో పులివెందుల జేఎన్టీయూ కళాశాల వద్ద నిందితులు ఇనుప రాడ్లతో దాడి చేశారన్నారు. ఈ కేసులో మరో నిందితుడు భాస్కర్‌రెడ్డి ప్రస్తుతానికి పరారీలో ఉన్నాడని, త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు. అలాగే పులివెందుల సబ్‌డివిజను పరిధిలో 18 గ్రామాలను ఫ్యాక్షన్ గ్రామాలుగా గుర్తించామన్నారు. మానవ ప్రాణానికి ఎటువంటి హాని కలిగించినా ఉపేక్షించేది లేదని, అలాగే సబ్ డివిజన్ పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల రూరల్ సీఐ వెంకటరమణ, సింహాద్రిపురం, తొండూరు సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

- నలుగురు అరెస్టు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని నాగులకట్ట వీధి శివార్లలో బైపాస్ రోడ్డు పక్కన వ్యభిచార గృహంపై ఆదివారం రాత్రి దాడి చేసి నలుగురిని పట్టుకున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తమకు రాబడిన సమాచారం మేరకు బైపాస్ రోడ్డు పక్కన బంకులో తమ సిబ్బంది అక్కడ నిఘా ఉంచారని, అదే సమయంలో అక్కడ ఇద్దరు మహిళలతో పాటు నాగన్న, అబ్దుల్లా అనే వారు ఉన్నట్లు గుర్తించారన్నారు. వారిని చాకచక్యంగా పట్టుకొని అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి, ఆ ప్రాంతంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా హెచ్చరించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇలాంటి పరిస్థితి జమ్మలమడుగు పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా ఉన్నట్లయితే ప్రజలు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు.

ట్రిపుల్‌ఐటీలో ఘనంగా సరస్వతి పూజ

వేంపల్లె, ఫిబబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మాఘమాసం వసంత పంచమి పురస్కరించుకొని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ సెంట్రల్ లైబ్రరీలో సరస్వతీ పూజను వేడుకగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి కోనప్ప ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ఏఓ రవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రత్నకుమారి తదితరులు పాల్గొని పూజలు చేశారు. విద్యార్థులనుద్దేశించి అధికారులు మాట్లాడారు.

సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో అక్షరాభ్యాసం

స్థానిక సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆలయపూజారి గిరి ఆధ్వర్యంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామికి, సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎస్పీకి శుభాకాంక్షలు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి, కడప పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ కో-ఆర్డినేటర్లు, నాయకులు సోమవారం సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు ఎస్పీని కలిసిన వారిలో అసెంబ్లీ కో-ఆర్డినేటర్లు బండి జకరయ్య, ధ్రువకుమార్‌రెడ్డి, ఇర్ఫాన్ బాషా, అశోక్‌కుమార్ రెడ్డి, అబ్దుల్ సత్తార్, గౌస్‌పీర్, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు

వేంపల్లె, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డి, వేంపల్లె సర్పంచు ఆర్.శ్రీనుపేర్కొన్నారు. వేంపల్లెలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల వార్షికోత్సవ సమావేశాలు ఘనంగా నిర్వహించారు. ఎంఈఓలు సాదిక్, స్టాలిన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పులివెందులటౌన్, ఫిబ్రవరి 3: పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని జయమ్మ కాలనీలో నివాసం ఉంటున్న కొడిదెల సంజీవరాయుడు (45) సోమవారం తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంజీవరాయుడు పట్టణంలో టైలర్‌గా పనిచేసేవాడు. గత కొద్దిరోజులుగా చెవినొప్పి రావడంతో సోమవారం అది తీవ్రతరం కావడంతో ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

సింహాద్రిపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురిజాల గ్రామంలో సోమవారం ఆరుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తులసీనాగప్రసాద్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3670 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్టైఫండ్ పెంచి న్యాయం చేయాలి

- పశువైద్య కళాశాల విద్యార్థుల ఆందోళన



కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వెంటనే స్టైఫండ్‌ను పెంచి న్యాయం చేయాలంటూ పశువైద్య కళాశాల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. సోమవారం గోపవరం పంచాయతీ పరిధిలో ఉన్న వెటర్నరీ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం ఎదుట విద్యార్థి నాయకుడు శివతరుణ్ ఆధ్వర్యంలో దాదాపు 300 మంది విద్యార్థులు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2013 నుంచి ఇప్పటి వరకు తమకు స్టైఫండ్ కింద కేవలం రూ.7 వేలు మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. నిత్యావసర ధరలు పెరిగినా స్టైఫండ్ మాత్రం పెరగలేదని వాపోయారు. ఎంబీబీఎస్ విద్యార్థులతో సమానంగా తాము కూడా ఐదున్నర సంవత్సరాలు చదువుతున్నామని పేర్కొన్నారు. మెడికల్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లో రూ.26 వేలు ఇస్తున్నారని, వెటర్నరీ ఇంటర్న్‌షిప్ కూడా వారితో సమానంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సిలిండర్ పేలి మహిళకు గాయాలు

- త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

సింహాద్రిపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పైడిపాళెం గ్రామంలో వెంకటలక్ష్మి అనే మహిళ ఇంట్లో సోమవారం గ్యాస్ సిలిండర్ పేలి ప్రమాదం చోటు చేసుకుంది. గ్రామస్థుల సమాచారం మేరకు.. వెంకటలక్ష్మి తన సొంత పనుల నిమిత్తం బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చి వంట చేసేందుకు గ్యాస్ పొయ్యిని వెలిగించబోయింది. కాగా గ్యాస్ లీక్ అయిన విషయాన్ని గమనించని వెంకటలక్ష్మి స్టౌవ్ వెలిగించేందుకు లైటర్ ఆన్ చేయగా ఒక్కసారిగా సిలిండర్ పేలింది. ప్రమాదంలో బాధితురాలికి తీవ్రగాయాలయ్యాయి. బాధితురాలిని వెంటనే పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. పేలుడు తీవ్రతకు ఇంటి పైకప్పుతో పాటు గోడల మధ్యన చీలికలు రావడంతో పాటు ఇంట్లోని ఫ్రిజ్, టీవీ తదితర సామగ్రి కూడా పాడైపోయాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



సిలిండర్ పేలి ఇంట్లో చిందరవందరగా పడిన సామగ్రి, (ఇన్‌సెట్లో) నెర్రెలు చీలిన గోడలు

హాకీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రవిచంద్ర

- రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా బి.లక్ష్మిదేవి



జె.రవిచంద్ర, బి.లక్ష్మిదేవి

ప్రొద్దుటూరుటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరుకు చెందిన జె.రవిచంద్ర, బి.లక్ష్మిదేవిలు హాకీ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గానికి ఎంపిక కావడంపై క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారిద్దరూ భార్యభర్తలు కాగా మొదటిసారి రాష్ట్ర కార్యవర్గం సభ్యులుగా ఎంపిక కావడంపై జిల్లా హాకీ అసోసియేషన్ నాయకులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. జె.రవింద్ర రాష్ట్ర హాకీ క్రీడాకారునిగా జాతీయస్థాయిలో ప్రతిభ కనపరిచారు. హాకీ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా, జిల్లా అధ్యక్షునిగా జిల్లాల్లో హాకీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఆయన ప్రతిభ ఆధారంగా పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికై స్పోర్ట్స్ కోటాలో హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో ఆర్‌ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూనే హాకీ క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నారు. బి.లక్ష్మీదేవి ఖోఖోలో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఆమె ప్రస్తుతం వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలులో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ హాకీ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఫిజికల్ డైరెక్టర్‌గా అనేకమంది విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. హాకీ అసోసియేషన్ వారు చేసిన సేవలను గుర్తించి అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గానికి ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గానికి వారు ఎన్నిక కావడానికి కృషి చేసిన అసోసియేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎన్.నిరంజన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు చాణిక్యరాజు, రాష్ట్ర కార్యదర్శి హర్ష, ఇతర కార్యవర్గ సభ్యులకు హాకీ అసోసియేషన్ మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి శేఖర్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

138 పరుగుల ఆధిక్యతలో ఆంధ్రా జట్టు



ఆంధ్రా - హిమాచల్ ప్రదేశ్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

కడప స్పోర్ట్స్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో ఆంధ్రా -హిమాచల్‌ప్రదేశ్‌ల మధ్య జరుగుతున్న క్రికెట్ పోటీల్లో సోమవారం ఆంధ్ర జట్టు 138 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. వివరాలిలా.. టాస్ నెగ్గి బ్యాటింగ్ దిగిన ఆంధ్రా జట్టు తొలుత 135.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 544 పరుగులు వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హిమాచల్ ప్రదేశ్ జట్టు 124.3 ఓవర్లలో 436 పరుగులు చేసింది. దీంతో ఆంధ్రా జట్టుకు 108 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించినట్లయింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో దిగిన ఆంధ్రజట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి 8 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 30 పరుగులు చేసింది. ఇందులో కె.రేవంత్‌రెడ్డి 19 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. ఇప్పటి వరకు ఆంధ్రాజట్టు 138 పరుగుల ఆధిక్యతతో ఉంది. కాగా ఆటకు మంగళవారం చివరి రోజు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లె పంచాయతీ కానపల్లెకు చెందిన తాటి గంగయ్య (54) సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. గంగయ్యది ముద్దనూరు మండలం తిమ్మాపురం గ్రామం. 35 ఏళ్ల క్రితం కానపల్లెలో వివాహం చేసుకుని ఇక్కడే నివాసముంటున్నాడు. కానపల్లెలో ఇతనికి 5 సెంట్ల స్థలం వుంది. ఇటీవలే ఆ స్థలం అమ్మేశాడు. తన స్వంత ఊరు తిమ్మాపురం వెళ్లాలని తలచాడు. కానీ ఈ స్థలం అమ్మడంపై భార్య భర్తల మధ్య ఘర్షణ జరిగింది. ఆదివారం కూడా తన భార్యతో గొడవ జరగడంతో సోమవారం ఉదయం భార్య బంధువుల ఇంటికి వెళ్లడం ద్వారా ఇంట్లో ఒంటరిగా వున్న గంగయ్య రేకుల ఇంట్లో పైపులకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు గంగరాజు ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువుల్లో నీరు..ఆయకట్టు బీడు


నిండుకుండలా దర్శనమిస్తున్నపెద్దమండ్యం పాతచెరువు


పంటలు లేక బీడుగా మారిన ఆయకట్టు భూములు

పెద్దమండ్యం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) చెరువులు నీటితో కళకళ లాడుతున్నా.. పంటలు సాగు లేక ఆయకట్టు భూములు బీడుగా దర్శనమిస్తున్నాయి. ఆ చెరువులకు నీరొచ్చే కాలువులకు లీకేజులే ప్రధాన కారణమని ఆయకట్టుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. పెద్దమండ్యం మండలంలోని గెల్లంవారిపల్లెకు సమీపంలోని కుషావతి నదిపై నల్లరాతిమడుగు ప్రాజెక్టు పనులు జరిగాయి. అక్కడ కుషావతినది నుంచి చెరువుకిందపల్లి లంజుకుంటచెరువు, పెద్దమండ్యం పాతచెరువు, బ్రాహ్మణ చెరువు, కుప్పాలకుంట కాలువలు ఉన్నాయి. ఆ ప్రాజెక్టు పనుల్లో లంజుకుంటచెరువు కాలువ పూడిపోయింది. గత మూడేళ్ల క్రితం తుఫాన్ సమయంలో నది ఉధృతి పెద్దమండ్యం పాతచెరువు కాలువపై పారడంతో కాలువకు గండి పండింది. అప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులు తాత్కాలిక మట్టి పనులు చేయించారు. కానీ కాలువ లీకేజీలు అపలేకపోయారు. ఒకన్నర నెల రోజుల క్రితం కురిసిన వానలతో ఆ మూడు చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. దీంతో రైతులు ఇక సాగునీటి కష్టాలు ఉండవని సంతోష పడ్డారు కానీ తాత్కాలిక పనులు చేసిన కాలువలకు మళ్లీ గండ్లు పడతాయని రైతుల్లో భయం నెలకొంది. దీంతో పంటల సాగుకు ముందుకు రాకపోవడంతో ఆ మూడు చెరువుల కింద ఆయకట్టు భూములు బీడుగా మారాయి. కేవలం 100 మీటర్ల కాలువకు శాశ్వత అభివృద్ధి పనులు చేయడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శలు వస్తున్నాయి. గతంలో రబీ వరి పంట చివరి దశలో పంటలకు నీరందక పంటలు ఎండిపోయాయి. దీంతో పెద్దమండ్యం పాతచెరువు, బ్రాహ్మణచెరువు, కుప్పాలకుంటల కింద ఆయకట్టు సుమారు 90 ఎకరాల్లో బీడుగా మారింది. ఈ కాలువలో గండి పడిన ప్రాంతంలో గండి పూడ్చే శాశ్వత్ఠ పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

కాలువలకు శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలి

కాలువలకు శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలి. పెద్దమండ్యం చెరువుల్లో నీరు పుష్కలంగా ఉన్నాయి. కానీ కాలువ లీకేజీతో చెరువు ఆయకట్టు భూములు బీడుగా మారాయి. ప్రభుత్వం చర్యలు తీసుకొని చెరువు కాలువలు మరమ్మతులు చేపట్టాలి.

-వలి, రైతు పెద్దమండ్యం

కాలువల మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపాం

గండ్లు పడిన చెరువుల కాలువల మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి ఉన్నాం. మండలంలో గండ్లు పడిన చెరువుల అభివృద్ధి పనుల కోసంరూ. 6.5 కోట్ల నిధులను ప్రతిపాదించాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే అభివృద్ధి పనులు చేపడతాం.

-శ్రీనివాసులురెడ్డి , ఇన్‌చార్జ్ ఏఈ, ఇరిగేషన్ శాఖ తంబళ్లపల్లి

సీటీఎం గంగజాతరకు ఆహ్వానం


సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు గంగజాతర ఆహ్వాన పత్రిక అందిస్తున్న కమిటీ సభ్యులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తొలి గంగ జాతర అయిన సీటీఎం నల్లవీర గంగజాతరకు రావాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు సీటీఎం సర్పంచ్ ఆనందపార్థసారథి ఆహ్వానించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్‌ను కలసిన గంగజాతర నిర్వాహక కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు సీటీఎం గంగజాతర ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నామన్నారు. దీంతో పాటు ఎద్దుల పరుష కూడా నిర్వహిస్తున్నామన్నారు. జాతర సందర్భంగా పోలీసు బందోబస్తు, రెవెన్యూ అధికారుల సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు చంద్ర, పారపట్ల సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పీలేరు ఆర్టీసీ డీఎంగా నిర్మల



పీలేరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ పీలేరు డిపో మేనేజర్‌గా పి.నిర్మల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పీలేరు డీఎంగా పనిచేస్తుండిన బండ్ల కుమార్ గత నెల 31వ తేదీన పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో తిరుపతి జిల్లా మంగళం డిపో మేనేజరుగా పనిచేస్తున్న పి.నిర్మల నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆమె పీలేరులో బాధ్యతలు స్వీకరించారు.

ఇస్కాఫ్ నూతన కమిటీ ఎంపిక


డీవీ రమణ జంషీర్‌బాషా జీవీ శివకుమార్

మదనపల్లె, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కాఫ్) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. మదనపల్లెలో సోమవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి తుంగా శ్రీధర్‌రావు అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర కార్యదర్శి జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించారు. ఇందులో జిల్లా అధ్యక్షునిగా డీవీ రమణ, గౌరవాధ్యక్షునిగా జంషీర్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా జీవీ శివకుమార్, కార్య వర్గసభ్యులుగా నాగేశ్వరరావు, లచ్చారెడ్డి, హేమనారాయణలను ఎంపిక చేశారు. ఈ కమిటీ జిల్లాలో ఇస్కాఫ్ సేవలను విస్తృతం చేయడంలో భాగంగా ఏప్రిల్ 26, 27వ తేదీలలో మదనపల్లెలో ఇస్కాఫ్ రాష్ట్రస్థాయి మహాసభలు నిర్వహించనున్నట్లు కమిటీ పేర్కొంది.

స్మగ్లరు సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం

పీలేరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న తమిళనాడు స్మగ్లరుతో సహా వాహనం, ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఎఫ్ఆర్‌వో ప్రియాంక సోమవారం తెలిపారు. పీలేరు-తలపుల మార్గం గూండా తమిళనాడుకు ఎర్రచందనం దుంగలు స్మగ్లింగ్ జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పీలేరు మండలం జాండ్ల గ్రామంలో వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఆ క్రమంలో సోమవారం ఉదయం 5 గంటలకు తలపుల వైపు నుంచి వేగంగా వచ్చిన కేఏ09 ఎం 7180 నెంబరు గల కారును గూడరేవుపల్లె వద్ద అటకాయించి అందులో ఉన్న తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లా, కొల్లూరు తాలూకా వల్లియర్ గ్రామానికి చెందిన ఎ.విజయ్‌కాంత్‌ను అదుపులోకి తీసుకుని 36 కిలోల బరువున్న మూడు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. విజయ్ కాంత్‌ను తిరుపతిలోని ఎర్రచందనం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ముందు హాజరు పరిచామన్నారు. దాడిలో ఎఫ్ఎస్‌వో సబిహా సుల్తానా, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నట్లు ఆమె వివరించారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్

కలకడ, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): భూమి విషయంగా గొడవ పడ్డ కేసులో నిందితులైన ఇద్దరిని సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. ఎనుగొండపాళెం పంచాయతీ గుండావాండ్లపల్లికి చెందిన వీరప్పనాగప్పనాయుడు కదిరాయచెరువు పంచాయతీ బొంతలవారిపల్లికి చెందిన చిన్నప్పకు భూతగాదాలు ఉన్నట్లు తెలిపారు. దీంతో వీరనాగప్పనాయుడు ఫిర్యాదు మేరకు చిన్నప్ప, ప్రసాద్‌లపై ఈ ఏడాది జనవరి 9న కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈక్రమంలో రిమాండ్ నిమిత్తం నిందితులను వాల్మీకీపురం కోర్టులో హాజరు పరచినట్లు ఎస్ఐ వివరించారు.

సమన్వయంతో అభివృద్ధికి పాటుపడదాం


పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశమైన ఎంపీడీవో

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వంతో పని చేస్తే అభివృద్ధిని సాధించవచ్చని ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఆయా సచివాలయాల్లో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అనేక నిధులను కేటాయించిందని వాటిని ఆయా గ్రామాల్లో మౌలిక వసతులకు వినియోగించి గ్రామాలను అభివృద్ధి పరుచుకొనుటకు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అంకిశెట్టిపల్లె సెక్రటరీని బదిలీ చేయాలి


ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీవైఎస్ నాయకులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయాలని బహుజన యువ సేన అధ్యక్షుడు పునీత్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఎదుట బీవైఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ పాలన నిబంధనలను అతిక్రమించి అంకిశెట్టిపల్లె పంచాయతీ పప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన మంజులను అదే పంచాయతీకి కార్యదర్శిగా నియమించారన్నారు. ఆమె స్థానికురాలై ఉండటం మూలాన కొందరికి అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఈ విషయమై నాలుగు నెలలుగా పోరాటం చేస్తున్నా అధికారులు స్పందించక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు హరీష్, చిరంజీవి, ఆది, శ్రీధర్, ఇమ్రాన్, శివకుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి మొండిచెయ్యి'

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి):కేంద్ర బడ్జెట్‌లో బీహార్‌కు భారీ అబ్ధి చేకూర్చి ఏపీకి మాత్రం మొండిచెయ్యి చూపారని కాంగ్రెస్ పార్టీ మదనపల్లె సీనియర్ నాయకుడు రెడ్డిసాహెబ్ ఆరోపించారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025 కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఏపీకి ఏమాత్రం ఉపయోగంలేదని ఆరోపించారు. బడ్జెట్‌లో ఏపీ రాష్ట్ర ప్రయోజనాలను ఏమాత్రం కేంద్రప్రభుత్వం పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. ఏపీకి ప్రత్యేక హోదా కోసం సీఎం చంద్రబాబు నాయుడే మోదీపై ఒత్తిడి తీసుకరావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ ఎస్‌కేబాషా, మహబూబ్‌పీర్, రవి, నాగరాజ పాల్గొన్నారు.

కొబ్బరి సాగులో మెళకువలపై శిక్షణ


రైతులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కలికిరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి సాగులో ఎదురయ్యే ప్రధానమైన సమస్యలపై వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగిన కొబ్బరి సాగుపై వారం రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొబ్బరి పంటలో యాజమాన్య పద్ధతులతోపాటు కొబ్బరి చెట్టు ఎక్కడానికి అందుబాటులోకి వచ్చిన సైకిల్ సిస్టమ్ క్లైంబర్‌పై రైతులకు శిక్షణ ఇవ్వడంతో ఒక ప్రధానమైన సమస్యకు పరిష్కారం లభించిందని తెలిపారు. కలికిరి ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి మాట్లాడతూ కొబ్బరి సాగులో మొక్కల ఎంపిక, యాజమాన్య మెళకువలు, చెట్టు ఎక్కడానికి ఉపయోగించే సైకిల్ వాడకం గురించి రైతులకు క్షుణ్ణంగా వివరించడం ఎంతో ప్రయోజనకమన్నారు. శిక్షణ పొందిన రైతులు ఇతర రైతులతో వారి అనుభవాలను పంచుకోవాలని కోరారు. కొబ్బరి చెట్టు ఎక్కడంలో శిక్షణ పొందిన 20 మంది ఔత్సాహిక రైతుల మధ్య నిర్వహించిన పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. మొదటి బహుమతికి ఎం.అజీజ్, రెండో బహుమతికి సందీప్‌కుమార్ రెడ్డి, మూడో బహుమతి వంశీకృష్ణ గెలుచుకున్నారు. పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శివాలయంలో విశేషపూజలు

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో మాఘమాసం మొదటి సోమవారం సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం శివుడికి పంచామృతాభిషేకం, ఏకవార రుద్రాభిషేకం, నిర్వహించారు. స్వామి వారిని అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

శాస్త్రోక్తంగా సామూహిక అక్షరాభ్యాసం


పీలేరులో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న నిర్వాహకులు

పీలేరు, ఫిబ్రవరి 3: వసంత పంచమి సందర్భంగా సోమవారం పీలేరు పట్టణంలోని సరస్వతీ శిశు మందిర్, ఇండియన్ బీచ్ ట్రీ స్కూల్ పాఠశాలల్లో శాస్త్రోక్తంగా సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. వసంత పంచమి సందర్భంగా చిన్నారులకు సరస్వతీ హోమం నిర్వహించి వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ అక్షరాభ్యాసం చేయించారు. వేర్వురుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో ఇండియన్ బీచ్ ట్రీ పాఠశాల నిర్వాహకులు భార్గవి, సుదర్శన్ నాయుడు, నాగేశ్వర స్వామి, హరీశ్ స్వామి పాల్గొన్నారు.

ములకలచెరువులో కనుల పండువగా..


ఓంను వేసి దీపాలు వెలిగించిన విద్యార్థులు

ములకలచెరువు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో సోమవారం వసంత పంచమి సందర్భంగా కన్నుల పండువగా అక్షరాభ్యాసం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక శారదా విద్యామందిర్, ఆక్స్‌ఫర్డ్ ఇంటర్నేషనల్ స్కూళ్లలో సరస్వతి దేవి పూజను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఓంను వేసి దీపాలు వెలిగించారు. అలాగే శారదా విద్యామందిర్‌లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో పాఠశాలల ఛైర్మన్ సనత్‌కుమార్, కరస్పాండెంట్ శ్రీవాణి, ప్రిన్సిపాల్ సిద్ధారెడ్డి, పాఠశాల అడ్మిన్ శ్రీనివాసులు, తెలుగు ఉపాధ్యాయులు రవిశేఖర్‌రెడ్డి, రవిబాబు, ప్రసాద్, మహమ్మద్, నూర్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను ప్రదర్శిస్తే మెరుగైన ఉద్యోగావకాశాలు


మాట్లాడుతున్న రిసోర్సుపర్సన్ ప్రేమ్‌కుమార్, హాజరైన విద్యార్థులు

కురబలకోట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జావాపై నైపుణ్యాలను ప్రదర్శిస్తే మెరుగైన ఉపాధి అవకాశాలను సాధించవచ్చని రీసోర్సుపర్సన్ ఆలుమూరు సుబ్రమణ్యం పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు 2రోజుల పాటు ఏ డీప్ డైవ్ ఇన్‌టు జావా డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా జావాలో పాల్గొనే వారి ప్రోగ్రామింగ్ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ రంగంలో మెరుగైన ఉద్యోగవకాశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో విభాగాధిపతి శ్రీదేవీ, కో ఆర్డినే టర్ దివ్య, నిత్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ముదివేడులో భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న జయచంద్రారెడ్డి, మల్లికార్జుననాయుడు

కురబలకోట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివేడులో భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ, సత్యభామ, రుక్మిణీ దేవీల విగ్రహాలను సోమవారం ప్రతిష్ఠించారు. దాతల సహకారంతో శ్రీ కృష్ణుడి ఆలయాన్ని నిర్మించి వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ విగ్రహాలను ప్రతిష్ఠించారు. కాగా కార్యక్రమానికి తంబళ్లపల్లె నియోజకవర్గ నేత జయచంద్రారెడ్డి, మల్లికార్జుననాయుడు పాల్గొని ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తుమ్మచెట్లపల్లె సూరి, వైజీ సురేంద్ర, రమణ, అయూబ్ బాషా, తిమ్మరాయుడు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వ్యవసాయ భూములకు దారి సౌకర్యం కల్పించండి


సబ్‌కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న బండ్లపై గ్రామ రైతులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తమ వ్యవసాయ భూములకు వెళ్లనీయకుండా కొందరు దారి మూసివేశారని, అధికారులు జోక్యం చేసుకుని డీకేటీ భూముల్లో దారి సౌకర్యం కల్పించాలని నిమ్మనపల్లె మండలం బండ్లపై గ్రామానికి చెందిన 25 మంది రైతులు కోరారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు డివిజన్ నలుమూలల నుంచి వచ్చిన 63 మంది అర్జీలు అందజేశారు. బండ్లపై రైతులు మాట్లాడుతూ పలుమార్లు తమ సమస్యలను అధికారులకు విన్నవించినా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. నిమ్మనపల్లె మండలం వెంగంవారిపల్లె సమీపంలో కుంటపోరంబోగు భూమికి సంబంధించి నాలుగేళ్ల క్రితం కొందరు రికార్డులు మార్చివేసి ఆక్రమించుకున్నారని, దీనిపై పాత రికార్డులు పరిశీలించి రూ.60లక్షల విలువైన ప్రభుత్వ భూమి కాపాడాలని రైతు రామచంద్రారెడ్డి సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మదనపల్లె పట్టణం టీకేపల్లె కాలనీలో 45 మంది చిన్నారులు ఉన్నారని, ఈ ప్రాంతంలో అదనపు అంగన్‌వాడీ సెంటర్ మంజూరు చేయాలని పోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ, ప్రతినిధులు సుభాషిణి, నరసింహులు సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. వాటితో పాటు సామాజిక పింఛన్లు, హౌసింగ్ స్థలాలు, సర్వే సమస్యలపై పలువురు అర్జీలు అందజేశారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి


విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, అధ్యాపకులు

పీలేరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రహదారి నిబంధనలపై యువత అవగాహన కలిగి ఉండాలని పీలేరు ఎంవీఐ విజయకుమారి పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఆమె ఆధ్వర్యంలో పీలేరులోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోడ్డు భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొంత కాలంగా పీలేరు ప్రాంతంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా యువతప్రాణాలు కోల్పోవడంగానీ, వికలత్వంగానీ పొందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మితిమీరిన వేగం, రహదారి నియమాలు పాటించకపోవడం వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు తమ అధ్యయనంలో తేలిందన్నారు. ద్విచక్ర వాహనాల్లో బయలుదేరేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలని, వీలైనంత తక్కువ వేగంతో వాహనం నడపాలన్నారు. రహదారి నియమాలు క్షుణ్ణంగా తెలిస్తే ప్రమాదాలు తగ్గించవచ్చన్నారు. అంతకుమునుపు కళాశాలలో రోడ్డు భద్రతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ఇందులో మొదటి స్థానంలో నిలిచిన వెన్నెల అనే విద్యార్థినికి ఎంవీఐ హెల్మెట్‌ను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ శివరామిరెడ్డి, అధ్యాపకులు సంధ్య ఆదూరి, సుధాకర్ రెడ్డి, ఎల్లయ్య, వెంకటరత్నం, కిశోర్ కుమార్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, యోగా గురువులు పీవీఎస్ లక్ష్మి, రాయల సుధాకర్, ఆర్టీసీ అసిస్టెంట్ డీఎం హరినాథ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామసముద్రం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా వెనుకబడిన వర్గాల జీవనోపాధికి రుణాలు అందించడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంపీడీవో భానుప్రసాద్ తెలిపారు. బీసీలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సంబంధించి ఈ డబ్ల్యూఎస్ కింద రుణ సదుపాయం పొందడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ఒక కాపీని ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈనెల 7వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు. అర్హత గల లబ్ధిదారుల ఎంపికను ఈనెల 8 నుంచి 11 వరకు నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు.

నిమ్మనపల్లిలో: రాష్ట్ర ప్రభుత్వం 50శాతం సబ్సిడీతో బీసీ కార్పొరేషన్ రుణాలను అందిస్తున్నట్లు ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని బీసీ కార్పొరేషన్ కింద 50శాతం సబ్సిడీతో 45 యూనిట్లు మంజూరు కాగా, ఒక్కో యూనిట్ రూ.2లక్షలుగా ఉందన్నారు. అలాగే కాపు కార్పొరేషన్ కింద 14యూనిట్లు మంజూరు కాగా రూ.2లక్షల వంతున ఇద్దరికి, రూ.3లక్షల వంతున 7మందికి, రూ.5లక్షల వంతున 5మందికి మంజూరు అయినట్లు తెలిపారు. ఈ బీసీ కేటగిరీల్లో 2యూనిట్లు మంజూరు కాగా ఇద్దరికి రూ.1,75వేలు, రెడ్డి సామాజిక వర్గానికి 2యూనిట్లు మంజూరు కాగా వాటిలో ఇద్దరికి రూ.1.75వేలు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ రుణాలు 50శాతం సబ్సిడీతో మంజూరు చేస్తామ న్నారు. రుణాలు పొందేందుకు ఈనెల 7వతేదీ వరకు అవకాశం ఉందని లబ్ధిదారులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుచేసుకోవాలని తెలిపారు.

ఫోర్జరీ సంతకాలతో డిజిటల్ అసిస్టెంట్ మ్యుటేషన్


సచివాయ డిజిటల్ అసిస్టెంట్‌పై ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న శాంతమ్మ

రామసముద్రం, ఫిబ్రవరి 3(ఆంధ్ర జ్యోతి): రామసముద్రం మండలం చొక్కాండ్లపల్లె గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దిలీప్‌కుమార్ ఫోర్జరీ సంతకాలతో తన పేరున మ్యుటేషన్ చేశారని పలమనేరు తాలుకా గంగవరం రెంటకుంట్ల గ్రామానికి చెందిన శాంతమ్మ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆమేరకు ఆమె సోమవారం రామసముద్రం ఎంపీడీవో భానుప్రసాద్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు శాంతమ్మ వివరాల మేరకు గంగవరం మండల రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 346/2ఏ-1ఏలో 0.81సెంట్ల భూమి ఉండగా గంగవరంకు చెందిన ఎస్ఆర్ అలేఖ్యకు పలమనేరు రిజిస్టర్ కార్యాలయంలో దస్తవేజు నెంబర్ 294/2024తో రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చింది. దీంతో గంగవరం రెవెన్యూ రికార్డ్‌లో కొనుగోలుదారులకు అడంగల్, 1బీ నమోదు అయ్యాయి. ఈ విషయమై కొనుగోలుదారులకు, విక్రయదారునికి ఎటువంటి అభ్యంతరాలు లేవు. ఈనేపథ్యంలో రామసముద్రం మండలంలోని చొక్కాండ్లపల్లె సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ దిలీప్ కుమార్ ఎవరో గుర్తు తెలియని వ్యక్తులతో లాలూచీ పడి శాంతమ్మ సంతకాలు ఫోర్జరీ చేసి తప్పుడు పత్రాలతో జనవరి 31, 2025న ఐడీ నెంబర్ 11090063తో ఆన్‌లైన్‌లో శాంతమ్మ పేరుపై మ్యుటేషన్ చేశారని ఎంపీడీవో భానుప్రసాద్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై డిజిటల్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

జాతీయ స్థాయి విజేత చేతన్‌కు ఘన సత్కారం


చేతన్ విఖ్యాత్ రెడ్డిని అభినందిస్తున్న ఎంఈవో లోకేశ్వర రెడ్డి, వీఎస్ఎన్ మాధవి, సిబ్బంది

పీలేరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): 'లీడ్ ఇండియా' సంస్థ నిర్వహించిన స్పెల్లింగ్ చాంప్స్ పోటీల్లో జాతీయ స్థాయిలో రన్నర్ అప్‌గా నిలిచిన కె.చేతన్ విఖ్యాత్ రెడ్డిని సోమవారం పీలేరు ఎంఈవో లోకేశ్వర రెడ్డి, వీఎస్ఎన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాధవి ఘనంగా సన్మానించారు. వీఎస్ఎన్ స్మార్ట్ కిడ్స్ క్యాంపస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవో లోకేశ్వర రెడ్డి మాట్లాడుతూ లక్షలాది మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ధైర్యంగా పాల్గొన్న చేతన్ విఖ్యాత్ రెడ్డి ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. వీఎస్ఎన్ కరస్పాండెంట్ మాధవి చేతన్‌ను, అతని తల్లిదండ్రులు కె.గౌరీ, కె.ద్వారకనాథరెడ్డిలను ఘనంగా సన్మానించారు. వీఎస్ఎన్ ఉపాధ్యాయ బృందం సురేశ్, శోభారాణి, శ్రావణి, బాబురెడ్డి, రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన కలిగిఉండాలి

గుర్రంకొండ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కుష్ఠువ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ రవీంద్రనా యక్ పేర్కొన్నారు. మండలంలోని ఎల్లుట్ల జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల కు కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు, రాగి రంగులో ఉండి నొప్పి లేని మచ్చ లు ఉంటే కుష్ఠువ్యాధిగా గుర్తించాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిబ్బంది రఫీ, నాగిరెడ్డి, రాజమ్మ, రేణుక, రమణమ్మలు పాల్గొన్నారు.

7 నుంచి సీటీఎం దర్గాలో ఉరుసు

మదనపల్లె అర్బన్ , ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీటీఎం గ్రామం రైల్వే గేటు వద్ద ఉన్న హజరత్ సయ్యద్ నాదర్‌షాహ్ వలీ ఉరుసు ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మసీదు కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో 7వ తేదీ గంధం, 8న గంధం ఊరేగింపు, 9న ఫాతెహా, 10న తహలీల్ ఫాతెహా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చాంధీని బండ్లతో పీర్ల మెరువణి, ఫకీర్ల వాయిద్యములతో ఊరేగింపు ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.